ప్రజాశక్తి

శనివారం 18 అక్టోబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం | అనకాపల్లి

కబ్జాల పర్వం

◆ పరవాడలో సుమారు రూ.480 కోట్ల విలువైన గెడ్డ హాంఫట్

◆ చోద్యం చూస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు

◆ ఆక్రమణలపై పర్యావరణవేత్తలు, రైతు సంఘాల ఆందోళన

ప్రజాశక్తి - పరవాడ

అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో ప్రభుత్వ భూములు, చెరువులు, గెడ్డల కబ్జాల పరంపర కొనసాగుతోంది. వాటిని కాపాడాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నిద్రమత్తులో జోగుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని గాజువాక - అచ్యుతాపురం ప్రధాన రహదారి పక్కన ఉన్న గెడ్డలు, చెరువులు ఆక్రమణలకు గురవడం స్థానిక ప్రజలకు, రైతులు, ప్రజాసంఘాల నేతలకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు వ్యవసాయానికి, భూగర్భ జలాల పునరుద్ధరణకు కీలకమైన ఈ ప్రాంతం

కబ్జాకు గురైన సర్వే నెంబర్ 226లోని గెడ్డ స్థలం

నేడు పాలకుల విధానాలతో కబ్జాదారుల కోరల్లో చిక్కుకుపోయింది.

మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 226లో ఉన్న ఐదు ఎకరాల గెడ్డ వాగు నేడు కబ్జాకు గురైంది. దీని ప్రస్తుత మార్కెట్ విలువ సుమారు రూ.480 కోట్లు. ఈ గెడ్డ వాగుపై గ్యాస్ సిలిండర్ల రిపేర్ యూనిట్, హోటల్ వంటి వాణిజ్య నిర్మాణాలు వెలిశాయి. ఇలాంటి ఆక్రమణలతో వర్షాకాలంలో నీరు నిల్వ ఉండే చెరువులు ఎండిపోతున్నాయని, దీనివల్ల తమ పొలాలకు నీటి లభ్యత తగ్గిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ, ఎవరూ మిగతా 2లో..

మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

విశాఖ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని, ఆ దిశగా అధికారులంతా ప్రత్యేక కృషి చేయాలని ఎంపీ శ్రీ భరత్ అన్నారు. పలు కంపెనీలు వస్తున్న నేపథ్యంలో మౌలిక వసతులను అభివృద్ధి చేయటంలో, వివిధ పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూర్చటంలో, నిర్దేశిత లక్ష్యాలు సాధించటంలో ప్రథమ స్థానంలో ఉండేలా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. కలెక్టరేట్ మీటింగు హాలులో శుక్రవారం జరిగిన దిశా (జిల్లా స్థాయి అభివృద్ధి సమన్వయ, మానటరింగ్ కమిటీ) సమావేశంలో కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరుతెన్నులపై, క్షేత్రస్థాయి పరిస్థితులపై సుదీర్ఘంగా ఆయన సమీక్షించారు. జిల్లాలో చేపట్టబోయే అభివృద్ధి ప్రాజెక్టులు, భవిష్యత్తు కార్యాచరణ, ఇతర అంశాలపై చర్చించారు. ముందుగా గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలపై అధికారులను ఆరా తీశారు. అజెండా అంశాలను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ వివరించారు. అనంతరం శ్రీభరత్ మాట్లాడుతూ విశాఖ పార్లమెంటు స్థానం పరిధిలో చేపట్టబోయే అభివృద్ధి ప్రాజెక్టులను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారులను, నగర రహదారులకు అనుసంధానం చేసే ప్రక్రియలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణ పథకాల్లో ప్రగతి సాధించాలని, పిఎం సూర్యఘర్ యూనిట్లను ఎక్కువ సంఖ్యలో నెలకొల్పాలని, రాజీవ్ గృహకల్పలో మిగిలిపోయిన ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు అందజేయాలని అన్నారు. టిడ్కో గృహ సముదాయాల్లో మిగతా 2లో..

నేడు 'ప్రభుత్వ రంగం - సామాజిక న్యాయం' సదస్సు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సిఐటియు 18వ అఖిల భారత మహాసభలు డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖ నగరంలో జరుగుతున్న నేపథ్యంలో కెవిపిఎస్, సిఐటియు ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'ప్రభుత్వ రంగం - సామాజిక న్యాయం' అన్న అంశంపై సదస్సు జరుగనుంది. ఈ విషయాన్ని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.సుబ్బన్న, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో డిఎస్ఎంఎం జాతీయ అధ్యక్షులు, ఎంపీ కె.రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, వక్తలుగా డిఎస్ఎంఎం జాతీయ నాయకులు వి.శ్రీనివాసరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.సత్యనారాయణ పాల్గొంటారని పేర్కొన్నారు. సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

డాక్ యార్డు బ్రిడ్జి ప్రారంభానికి చర్యలు తీసుకోండి

▶ వార్త 2లో..

హైకోర్టు ఆదేశాల మేరకు పరిహారం చెల్లించాలి

▶ వార్త 8లో..

అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ వద్దు

▶ వార్త 4లో..

మాట్లాడుతున్న అమర్‌నాథ్

ఉద్యోగాల కల్పనపై గూగుల్‌తో ప్రకటన చేయించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉద్యోగాల కల్పనపై గూగుల్‌తో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయించాలని మాజీ మంత్రి, వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్‌పై తాను సబ్జెక్ట్ మాట్లాడుతుంటే మంత్రి నారా లోకేష్ మాత్రం తనపై వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అమర్‌నాథ్ పలు అంశాలపై మిగతా 2లో..

రెగ్యులర్ చేయాలి

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళనలు

విశాఖలో..

అనకాపల్లిలో..

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గ్రీన్ పార్క్ హోటల్‌కు ఎదురుగా ఉన్న ఎలక్ట్రికల్ ఎస్ఇ కార్యాలయం వద్ద యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్ట్రగుల్ కమిటీ అధ్యక్షులు వేపాడ సత్యనారాయణ, నాయకులు ప్రేమ చంద్రశేఖర్, ఆర్.సత్యారావు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పీస్ రేట్ విధానంలో పనిచేస్తున్న మీటర్ రీడర్లకు, స్టోర్ హమాలీలకు పీస్ రేట్ రద్దు చేసి నెలవారీ జీతాలు చెల్లించాలని మిగతా 2లో..

నాతయ్యపాలెం / గంభీరం / దేశపాత్రునిపాలెం

శివకాశి అయ్యన్ బాణాసంచా షోరూమ్

శీలానగర్: NH-5, మార్బుల్ షాప్ ఎదురుగా, నాతయ్యపాలెం, BHPV పోస్ట్, విశాఖపట్నం

గంభీరం: పైడా కాలేజీ ఎదురుగా, శశి కాలేజీ రోడ్, గంభీరం, విశాఖపట్నం

దేశపాత్రునిపాలెం: పరవాడ మండలం, అనకాపల్లి జిల్లా

అయ్యన్ గ్రీన్ క్రాకర్స్ అమ్మబడును

AYYAN'S GREEN CRAKERS AVAILABLE

◆ COMPANY FRESH ITEM ◆ GENUINE RATES

BUNNY BRAND FANCY FIREWORKS

SIVAKASI'S Ayyan's FIRE WORKS

For Rates Visit: www.vizagayyan.in

NH-5, Opp. Marble Shop, Natayyapalem, SHEELANAGAR, Vizag-12.

Opp. Pydah College, Sasi College Road, GAMBHIRAM, Vizag.

Paravada Mandalam, DESAPATRUNIPALEM, Anakapalli Dist.

మొదటి పేజీ తరువాయి..

కబ్జాల పర్వం

పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇది కేవలం ఆక్రమణదారుల దౌర్జన్యం మాత్రమే కాకుండా అధికారులు, రాజకీయ నాయకుల మధ్య ఉన్న బంధానికి నిదర్శనమని మండిపడుతున్నారు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సిన ఇరిగేషన్ అధికారులు పత్తాలేకుండా పోయారని విమర్శిస్తున్నారు. జల వనరుల రక్షణపై న్యాయస్థానాలు ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలను సైతం అధికారులు లెక్కచేయకపోవడం విచారకరం.

కోర్టులు ఏం చెబుతున్నాయి ?

ఈ ఏడాది ఎపి హైకోర్టు (డబ్ల్యూపి నెంబర్ 15511/2021) ఆదేశాలు ఇలా ఉన్నాయి. నీటి మార్గాలపై ఆక్రమణలను ఆరు నెలలకు ఒకసారి తనిఖీ చేయాలి. గుర్తించిన వాటిని 15 రోజుల్లోగా తొలగించాలి. ఈ ఆదేశాలను పాటించని పక్షంలో అధికారులు నేరుగా బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇంతలా హైకోర్టు ఆదేశించినప్పటికీ స్థానిక అధికారులు లెక్కచేయడం లేదు.

తిరుపతి, హుస్సేన్ సాగర్ కేసులను ఓసారి పరిశీలిస్తే.. తిరుపతిలో చెరువుపై అక్రమ నిర్మాణాల కేసులో 'ప్రజల వనరులను రక్షించకపోతే ప్రభుత్వమే నేరస్థం' అని హైకోర్టు స్పష్టం చేసింది. హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ ఉదంతంలో సుప్రీంకోర్టు కూడా జల వనరులపై ఎలాంటి శాశ్వత నిర్మాణాలూ ఉండరాదని చెప్పింది. ఇవెక్కడా మండలంలో అమలైన దాఖలాలులేవు.

రెగ్యులర్ చేయాలి

డిమాండ్ చేశారు. ఇతర కాంట్రాక్టు కార్మికుల సమస్యలనూ పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు అవతారం, స్టోర్స్ హమాలీస్ నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన అనకాపల్లి జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం ఎదురుగా శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ స్ట్రగుల్ కమిటీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వేపాడ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు పి.చంద్రశేఖర్, కార్యదర్శి ఆర్.సత్యారావు మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతో జరుగుతున్న చర్చలు విజయవంతం కాకపోతే సమ్మెకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వివి.శ్రీనివాసరావు, ఆర్.శంకరరావు, స్ట్రగుల్ కమిటీ నాయకులు పి.శ్రీనివాసరావు, దార అప్పారావు, కె.రవికుమార్, నాగ అప్పారావు, ఎన్.అవతారం, మురళి, శివకేశవ, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

వసతులు కల్పించాలన్నారు. విద్యా పరంగా కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలతో పోటీపడి పని చేయాలని నిర్దేశించారు. ఇటీవల దుకాణాల తొలగింపు ప్రక్రియపై ప్రస్తావన తెచ్చిన ఆయన నిజమైన అర్హులకు దుకాణాలు పెట్టుకునే అవకాశం ఇవ్వాలన్నారు. త్వరితగతిన వెండింగ్ జోన్లు గుర్తించాలని, జీవనోపాధి కోసం తాపత్రయపడే వాళ్లను గుర్తించి సహకారం అందించాలని, దళారులుగా వ్యవహరించే వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో భాగంగా ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు పలు ప్రజా సమస్యలను ప్రస్తావించారు. కార్యక్రమంలో జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జెడ్‌పి సిఇఒ, దిశా కన్వీనర్ పి.నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనపై గూగుల్‌తో ప్రకటన చేయించాలి

మాట్లాడారు. విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు కోసం రూ.22 వేల కోట్ల రాయితీలిస్తున్న ప్రభుత్వం సంస్థ ఏర్పాటు ద్వారా రాష్ట్రానికి వచ్చే ప్రయోజనాలమీద మాత్రం స్పష్టతనివ్వడం లేదన్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ ఈ నెల 22న చలో రాజయ్యపేట కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

నిహారికను కిడ్నాప్ చెర నుంచి రక్షించాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: రాంనగర్ ప్రాంతం, భానోజీనగర్‌కు చెందిన ధనాల నిహారికను కిడ్నాప్ చేసి, ఆమె వద్ద ఉన్న విలువైన బంగారు, వెండి నగలు, డబ్బు దోచుకున్న బంగారు సూర్య వెంకటరావు, అతని కుమారులు సంతోష్, ప్రసాద్, పద్మను తక్షణం అరెస్ట్ చేయాలని, నిహారికను కిడ్నాప్ చెర నుంచి విముక్తి కలిగించి తమకు అప్పగించాలని ఆమె తల్లి డి.పైడితల్లమ్మ, తండ్రి డి.శ్రీనివాసులు, సోదరి లోహిత కోరారు. శుక్రవారం జగదాంబదరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, ఈ నెల8వ తేదీన తమ ఇంటి వద్ద ఉన్న నిహారికను కిడ్నాప్ చేసి, ఇంట్లో ఉన్న బంగారం, వెండి, డబ్బును బంగారు సూర్య వెంకటరావు, అతని కుమారులు తీసుకు వెళ్ళిపోయారని దీనిపై తాము అదే రోజున టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. పోలీసులు ఎటువంటి చర్య తీసుకోకపోవడంతో పోలీస్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయం తెలిసి టూటౌన్ పోలీసులు నిహారిక మేజర్ కదా పెళ్లి చేయరా, ఇంట్లో ఉంచి పూజిస్తారా అంటూ అవమానకరంగా మాట్లాడారని విమర్శించారు. నిహారిక ఆరోగ్యం బాగోలేదని చెప్పినా సిఐ అవమానకరంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కిడ్నాప్ చేసిన వ్యక్తులు పద్మనాభంకి చెందినవారు కావటంతో పద్మనాభం పోలీస్‌స్టేషన్‌కి వెళ్లాలని సూచించారని, ఆయన చెప్పిన ప్రకారం వెళ్లామని అక్కడ కిడ్నాప్ చేసిన వ్యక్తులు స్టేషన్‌లో కనిపిస్తే నిహారికను తిరిగి అప్పగించాలని కోరగా ముద్దాయిలు పోలీసుల సమక్షంలోనే దౌర్జన్యానికి పాల్పడ్డారని తెలిపారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు, సిఐటియు జగదాంబ జోన్ నాయకులు కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డాక్ యార్డు బ్రిడ్జి ప్రారంభానికి చర్యలు తీసుకోండి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం నేవల్ డాక్ యార్డు వద్ద సర్దార్ వల్లభాయ్ పటేల్ పార్లర్ బ్రిడ్జి పునర్నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి, ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు, పోర్టు ఛైర్మన్‌కు లేఖ రాశారు. ఆ వివరాలను శుక్రవారం మీడియాకు వెల్లడించారు. బ్రిడ్జి పునర్మిర్మాణ పనులు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ పనుల నిమిత్తం రహదారిని 2024 ఆగస్టు 1న మూసివేసిన విషయాన్ని గుర్తుచేశారు. తొమ్మిది నెలల్లో పనులు పూర్తి చేయించి తిరిగి ప్రారంభిస్తామని చెప్పారని, ఆ గడువు కాస్త 14 నెలలు అయిపోయిందని, ఇంతవరకు బ్రిడ్జి ప్రారంభం కాలేదని అన్నారు. పనులు నెమ్మదిగా జరుగుతున్నాయన్నారు. జివిఎంసి 40, 58 నుంచి 64 వార్డుల పరిధిలోని సుమారు రెండు లక్షల మంది ప్రజలు, రక్షణ రంగం, షిప్ యార్డు, హెచ్‌పిసిఎల్, ఐఒసి, కోరమాండల్, ఇతర పరిశ్రమల కార్మికుల ప్రయాణానికి ఈ రహదారి అత్యంత కీలకమని పేర్కొన్నారు. వారంతా ప్రస్తుతం మారుతీ జంక్షన్ మీదుగా ఆరు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోందన్నారు.

ఈ మార్గంలో భారీ వాహనాలు పెద్దఎత్తున రాకపోకలు సాగి, ప్రమాదాలు జరిగి ఈ సంవత్సర కాలంలోనే ఎనిమిది మంది మరణించారన్నారు. ఈ మార్గంలో ఎదరవుతున్న ఇబ్బందులను జగ్గునాయుడు తెలియజేశారు. సాగరమాల ప్రాజెక్టులో భాగంగా నగరం నుంచి ఈ బ్రిడ్జికి కనెక్టివిటీ పనులను కూడా వేగవంతం చేయాలన్నారు.

గిరిజన విద్యార్థుల మరణాలు పట్టవా ?

విద్యార్థిని పరామర్శిస్తున్న మాల్యాద్రి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గిరిజన విద్యార్థుల మరణాలు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టవా ? అని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి ప్రశ్నించారు. కురుపాం గురుకుల పాఠశాలలో పచ్చకామెర్ల వ్యాధి బారిన పడి కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆయన శుక్రవారం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే పి.అంజలి, టి.కల్పన అనారోగ్యంతో మరణించారని, పలువురు అనారోగ్యంతో నేటికీ చికిత్స పొందుతున్నారని తెలిపారు. గురుకులాలు, హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు ఉన్నారు.

స్కోడా ఫ్రీ బుకింగ్స్ ప్రారంభం

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ: స్కోడా ఒక్టవి ఆర్ఎస్ ఫ్రీ బుకింగ్స్ శుక్రవారం నుండి విశాఖలో ప్రారంభమయ్యాయని సంస్థ బ్రాండ్ డైరెక్టర్ ఆశిష్‌గుప్తా తెలిపారు. శుక్రవారం విశాఖలోని స్కోడా షోరూంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ భారతదేశంలో స్కోడా 25 ఏళ్ల సంబరాలు జరుపుకుంటున్న సందర్భంగా ఈ వాహనాన్ని విడుదల చేస్తున్నామని, ఈ మోడల్‌కు అద్భుతమైన స్పందన వచ్చిందని ఆయన అన్నారు. ఈ వాహనం 2 ఇఎస్ఐ టర్బో చార్జ్ పెట్రోల్ ఇంజిన్ కలిగి 195 కెడబ్ల్యు పవర్‌ని అందిస్తుందని, 370 ఎన్ఎం టార్కులు ఉత్పత్తి చేస్తుందని, 7 స్పీడ్ డిఎస్జి ఆటోమేటిక్ ట్రాన్స్మిషన్ సహాయంతో కేవలం 6.4 సెకండ్లలోనే కారు వేగం 0 - 100కు చేరుకుంటుందని ఆయన తెలిపారు. అత్యాధునిక ఛాసిస్ సెటప్ స్టీరింగ్ స్పోర్ట్స్ సస్పెన్షన్ కలిగి చక్కని డ్రైవింగ్ డైనమిక్స్ అందిస్తుందన్నారు. ఈ వాహనం డెలివరీ నవంబర్ 6 నుండి ప్రారంభమవు తాయని ఈ వాహనం యొక్క ప్రారంభ ధర రూ. 49,99,000గా ఉందని ఆయన తెలిపారు.

దివీస్ ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టాలి

సిఐటియు

ప్రజాశక్తి - తగరపువలస : చిప్పాడ దివీస్ లేబొరేటరీస్‌లో గురువారం విషవాయువులు లీకై ఇద్దరు టెక్నిషియన్లు అస్వస్థతకు గురైన ఘటనపై ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని సిఐటియు భీమిలి అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎస్ఎన్.మూర్తి, ఎస్.అప్పలనాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దివీస్‌లో భద్రతా ప్రమాణాలు కొరవడ్డాయన్నారు. కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని తెలిపారు. దివీస్‌తో ఇప్పటికే ఈ ప్రాంతమంతా కాలుష్యభరితంగా తయారైన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో సంఘం మండల నాయకులు ఎన్.రాము, గుజ్జు నరసింహారావు పాల్గొన్నారు

విశాఖ కలెక్టరేట్ : ఇటీవల కాలంలో ఫార్మా కంపెనీలలో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నా యాజమాన్యాలు మాత్రం భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. దివీస్ లేబొరేటరీస్‌లో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురైన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రమాదం జరిగిన తర్వాత కూడా దాన్ని బయట ప్రపంచానికి తెలియకుండా దివీస్ యాజమాన్యం కప్పిపుచ్చడానికి ప్రయత్నం చేయడం దారుణమన్నారు. ప్రమాదంలో అనేకమంది అస్వస్థతకు గురయ్యారని తెలుస్తోందని, వారికి పూర్తిగా ఆరోగ్యం బాగయ్యేవరకు యాజమాన్యమే బాధ్యత వహించాలని అన్నారు. ప్రమాద కారణాలను తెలుసుకొనేందుకు వెంటనే ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు సేఫ్టీ ఆడిట్‌ను ప్రతి సంవత్సరం నిర్వహించాలన్నారు. కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని యాజమాన్యాన్ని, ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 28 వినతులు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌లో 28 వినతులు వచ్చాయని జివిఎంసి చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం జివిఎంసి ప్రధాన కార్యాలయం లో సిపిలు, డిసిపిలు, ఎసిపిలతో కలిసి ప్రత్యేకంగా టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్‌సిటీ ప్లానరు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

అర్ధరాత్రి పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: పారిశుధ్య పనులు చిత్తశుద్ధితో నిర్వహించాలని జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ పారిశుధ్య కార్మికులను ఆదేశించారు. శుక్రవారం అర్ధరాత్రి సిరిపురం దత్‌ఐలాండ్ వద్ద పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జివిఎంసి కమిషనర్ పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతూ రాత్రి నిర్వహించే పారిశుధ్య పనులు సక్రమంగా చిత్తశుద్ధితో నిర్వహించాలని ఆదేశించారు. ఒక్కొక్క పారిశుధ్య కార్మికుడు ఎంత పరిధిలో విధులు నిర్వహిస్తున్నారని ,ఏ సమయం నుండి ఏ సమయం వరకు విధుల్లో ఉంటున్నారని ఆరా తీశారు.

మహారాజశ్రీ అనకాపల్లి 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 68/2024

బిట్వీన్:
బుద్ధ గోపాలకృష్ణ . . . వాది
అండ్:
రగోతి నరసింగరావు మరియు ఒకరు . . . ప్రతివాదులు

1,2 ప్రతివాదులకు దావాసమును

1) రగోతి నరసింగరావు, తండ్రి అచ్చన్న, హిందూ, వయసు 38 సంవత్సరములు. టీచర్, నివాసం డోర్ నెంబర్ 2-5-210, సెక్టార్ -7, ఫిషర్మెన్ కొలనీ, విశాఖపట్నం.
2) రగోతి భూలోకమ్మ, భర్త అచ్చన్న, హిందూ, వయసు 55 సంవత్సరంలో. గృహిణి, నివాసం డోర్ నెంబర్ 2-5-210, సెక్టార్ -7, ఫిషర్మెన్ కొలనీ. విశాఖపట్నం.

పై నెంబరు దావాలో పై కోర్టు వారు పంపిన సమన్లు మీరు అందుకోనందున, సదరు కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **20-11-2025వ తేదీకి** వాయిదా వేసి ఉన్నారు. కావున ఆరోజు **ఉదయం 10:30 నిమిషములకు** మీరు స్వయంగా గాని, లేక మీ తరఫున లాయరు గారు గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపనులను తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్ష మందు పైనెంబర్ దావా తీర్మానించబడును.

బుద్ధ త్రినాథరావు
I.V.S. ప్రసాదరావు
వాది తరపు అడ్వకేట్స్, అనకాపల్లి.
సెల్: 6300740064

పేరు మార్పు

నా పేరు కోన పావని C/o మాపాడ వీరునాయుడు వయస్సు 30 సం॥లు హిందూ, వి.శరభవరం గ్రామం, రోలుగుంట మండలం, అనకాపల్లి జిల్లా. నా పేరు ఆధార్ కార్డులో మాపాడ పావని అని తప్పుగా ముద్రించబడింది. నా యొక్క అన్ని సర్టిఫికేట్స్‌లలో కోన పావని అని ఉంది. నా యొక్క పేరు ఆధార్‌లో కోన పావని C/o మాపాడ వీరునాయుడుగా ముంద్రించుట కొరకు ఆధార్ నెం.560957960076

IN THE HONOURABLE COURT OF CIVIL JUDGE SENIOR DIVISION AT NARSIPATNAM
IA.83/2024 in OS.110/2016

Between:
Midathana Rambabu & Another . . . Petitioners
And:
Lalam Radha Kumari & Others . . . Respondents

GENERAL NOTICE

As per orders of the Hon'ble court passed in above numbered Final Decree Petition filed in pursuance of preliminary decree passed in above numbered suit, The below mentioned schedule House will be sold in public auction by the Hon'ble Court on **05-11-2025 from 10-30 am to 5 pm**. Any person who is interested in the said auction may participate.

Schedule of property:
Visakhapatnam District, Presently Anakapalli District, Narsipatnam Sub-Registry, Golugonda Mandalam, Chodyam Village and Grama Panchayath, Tiled House bearing Door No.1-30, House in an extent of 300 Sq.feet, site 100 Sq.yards bounded by:-
East: Site of Veterinary Hospital
South: Panchayath Road
West : Site and Room of Midathana Pallalamma
North: Site of Bandaru Dongodu

By Order of the Court
P. NARASIMHAM
Advocate for Petitioners
Behind Old Municipal Office
Narsipatnam, Ankapalli Dist.
Ce 9440857567
Narsipatnam,
Date:16/10/2025

టెన్త్ విద్యార్థుల నైట్ స్టడీస్ పరిశీలన

విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ఆనందపురం: పదో తరగతిలో శతశాతం మెరుగైన ఫలితాల సాధనే లక్ష్యంగా ఇప్పటినుంచే అధికారులు ముమ్మర చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంఆ ఆనందపురం మండలం వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల పరీక్షల సన్నద్ధత, నైట్ స్టడీ నిర్వహణపై మండలస్థాయి అధికారులు శుక్రవారం ప్రత్యేక పరిశీలన జరిపారు, ఎంఇఒ జోగేంద్రనాథ్, ఆనందపుం, వెల్లంకి ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు కామేశ్వరరావు, దాడిశెట్టి రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల బృందం నైట్‌స్టడీస్‌ను నేరుగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులకు తగు సూచనలు చేశారు. సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికతో చదవితో మంచి ఫలితాలు సాధ్యమని వివరించారు. విద్యార్థులకు మోటివేషన్‌కు అవసరమైన చర్యలు చేపట్టారు.

వైసిపి వినూత్న నిరసన

ప్రజాశక్తి-సీతమ్మధార. : అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని మంటగలిపి, కూటమి పాలనలో నారా లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడిపిస్తున్నాడని వైసిపి దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ఆరోపించారు. దీన్ని నిరసిస్తూ శుక్రవారం 27వ వార్డులో 'మహాత్ములారా మన్నించండి' అంటూ దక్షిణ వైసిపి శ్రేణులు వినూత్న నిరసన చేశారు. అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను శుభ్రం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ, పేదలకు అందాల్సిన సంక్షేమం, అభివృద్ధిలో కూటమి అరాచకాలకు చరమగీతం పాడుదామని పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైద్యకళాశాలలను, విశాఖ భూములను చంద్రబాబు బినామీలకు, బడా కంపెనీలకు దారాదత్తం చేస్తూ పేదలకు గజం భూమి కూడా లేకుండా చేస్తున్నారని వాసుపల్లి ధ్వజమెత్తారు. ప్రజావ్యతిరేకంగా వ్యవహరిస్తున్న కూటమికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

మహారాజశ్రీ VIIIవ అదనపు జిల్లా జడ్జి కోర్టు గాజువాక
I.A.No. 85/2025 in O.S.No. 59/2018

బిట్వీన్:
శ్రీమతి కర్రి బంగారమ్మ మరియు ఇతరులు ... వాదులు / పిటిషనర్లు
అండ్:
శ్రీమతి కర్రి వరహాలమ్మ మరియు ఇతరులు ... ప్రతివాదులు / రెస్పాండెంట్స్

నోటీసు

టు:
R-7: దాసరి లక్ష్మీకాంతం, W/o. మహాలక్ష్మి డో.నెం.62-2-13, వెంకటాపురం, విశాఖపట్నం.
R-12: గాడి సత్యవతి, W/o. భాస్కరనాయుడు D/o.గంర్రెడ్డి శంకరమ్మ, డో.నెం.31-25-1, కూర్మన్నపాలెం, విశాఖపట్నం.

పై నెంబరు గల దావాలో శ్రీమతి కర్రి బంగారమ్మ మరియు ఇతరులు I.A.No. 85/2025 in O.S.No. 59/2018 అను పిటిషన్‌లో మిమ్మలను ప్రతివాదులు నెం.7 మరియు 12గా చేర్చమని వేసియున్నారు. మీకు ఎన్నిమార్లు పిటిషన్ నోటీసులు పంపించినను మీరు అందుకోనందున ఈ ప్రకటన ద్వారా మీకు నోటీసులు పంపించడమైనది. పైనెంబరు గల పిటిషన్ **29-10-2025న** వాయిదా అయివున్నది.

కావున పై దినమున మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని **ఉదయం గం. 10-30 ని॥లకు** పైకోర్టులో హాజరై మీ ఆక్షేపణలను తెలుపవలెను. లేనియెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

By Order of the Hon'ble Court)
B.YASODHARA VEDAMANI
K.V.RAMANA & K.RAHUL
Advocates, Gajuwaka,
Visakhapatnam.
Cell : 9246621519, 9248809471

అభివృద్ధికి కేంద్రంగా భీమిలి

- టిడిపి మండల కమిటీ ప్రమాణస్వీకారంలో ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి-పద్మనాభం : రాష్ట్రంలోనే అభివృద్ధికి కేంద్రంగా భీమిలి నియోజకవర్గం మారిందని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహంలో టిడిపి నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం, ఇటీవల నామినేటెడ్ పదవులు పొందిన నేతల సత్కారంలో మాట్లాడుతూ, నియోజకవర్గంలో రూ.4700కోట్లతో వివిధ పనులను చేపట్టి, 70శాతం పూర్తి చేశామన్నారు. భీమిలి అభివృద్ధిపై సిఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టిపెట్టారన్నారు. తర్లువాడ, కృష్ణాపురంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో ఈ ప్రాంతానికి ప్రపంచఖ్యాతి రానుందన్నారు. అనంతవరం,కొవ్వాడల్లో భూసేకరణ పూర్తయితే మరిన్ని కంపెనీలు వచ్చి, నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. నియోజకవర్గంలోని ఏడు గ్రామాల్లోని ఇనాం భూముల సమస్య పరిష్కరిస్తామన్నారు. ఆలయ ఇఒ నరసింహరాజు ఆహ్వానం మేరకు ముందుగా పవిత్రోత్సవాలు జరుపుకుంటున్న అనంతపద్మనాభుని ఎమ్మెల్యే గంటా దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే గంటా

సందిట్లో సడేమియా.. చేతివాటం చూపిన జేబుదొంగలు

టిడిపి సమావేశంలో జేబుదొంగలు చేతివాటం చూపించారు. నూతన కమిటీ ప్రమాణస్వీకారం, నేతల సత్కార కార్యక్రమాల్లో టిడిపి నేతలంతా సందడి ఉంటే, సందిట్లో సడేమియా అన్నట్లు ముగ్గురు నేతలకు చెందిన రూ. 96,500 నగదు అపహరణకు గురైంది. తునివలస మాజీ సర్పంచ్ గులమజ్జి మహేశ్వరరావు రూ.46500., మాజీ ఎంపిటిసి రాచకొండ అప్పల నరసింహమూర్తికి చెందిన రూ.పదివేలు, గడ్డపట టిడిపి సీనియర్ నేత గెడ్డ ప్రసాద్‌కు చెందిన రూ.30వేలు చోరీకి గురైంది. నేతలంలా కార్యక్రమం హడావిడిలో ఉంటే, వారి జేబుల్లోని నగదును గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించినట్లు అక్కడి వీడియో రికార్డింగ్‌లో నమోదైంది. దీని ఆధారంగా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ప్రచారం

ప్రజాశక్తి -గాజువాక : జనావాసాల వద్ద అదానీ అంబుజా సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటును తక్షణమే విరమించుకోవాలని సిపిఐ నేతలు డిమాండ్ చేశారు.శుక్రవారం సిమెంట్ ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తూ 64వ వార్డు గంగవరంలో సిపిఐ ఆధ్వర్యంలో ఇంటింటా కరపత్రాలను పంచుతూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు జి.ఆనంద్ మాట్లాడుతూ గంగవరం పోర్టు కాలుష్యంతో ఇప్పటికే ప్రజలు అవస్థలు పడుతున్నారని, ఇపుడు సిమెంట్ ఫ్యాక్టరీని నెలకొల్పితే గాజువాక ప్రాంతం బూడిద కుంపటిగా మారుందని ఆవేదన వెలిబుచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు పల్లేటి పోలయ్య, కె.పోతయ్య ,పెదపూడి దుర్గారావు, పేర్ల సోమేష్, పి.శివ, యూ.ఈశ్వరరావు పలువురు మహిళలు పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో పూడికల తొలగింపు

ప్రజాశక్తి- వేపగుంట : .జివిఎంసి 93వ వార్డు బిఆర్‌టిఎస్ కాలనీలో విద్యుత్ కార్యాలయం వద్ద కాలువల్లో పేరుకుపోయిన పూడికలను శుక్రవారం వార్డు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ చరణ్ ఆధ్వర్యంలో ప్రొక్లెయినర్‌తో తొలగించారు. కాలువల పూడుకుపోవడంతో మురుగునీరు బిఆర్‌టిఎస్ ప్రధాన రహదారిపై ప్రజలు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, పూడికతీత పనులు చేపట్టారు. అయితే ప్రధాన కాలువల్లో కేబుల్‌వైర్లు ఉండడంతో చెత్తాచెదారం వాటికి అడ్డుకుని మురుగునీరు నిల్వ ఉండి, పూడికలు పేరుకుపోతున్నాయి.

అన్నదానం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -తగరపువలస: భీమునిపట్నం మండలం లక్ష్మీపురం గ్రామంలో అయ్యప్ప స్వామి సేవాపీఠంలో ఈనెల 22 నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు 41 రోజులు పాటు జరగనున్న నిత్య అన్నసమారాధన ఆహ్వాన పత్రికను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. సేవాపీఠం ధర్మకర్త గాడు తాతినాయుడును ఎమ్మెల్యే గంటా అభినందించారు కార్యక్రమంలో భీమిలి టిడిపి ఇన్‌ఛార్జి చిక్కాల విజయబాబు, జెడ్‌పిటిసి గాడు వెంకటప్పుడు, కనకల వెంకటరమణ పాల్గొన్నారు

మహారాజశ్రీ గాజువాక 13వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
I.A 388/2019 IN A.S 5/2017

బిట్వీన్:
గల్లా పైడమ్మ (డైడ్) వగైరాలు ... అపిలెంట్లు.
అండ్:
తలారి చిట్టిబాబు వగైరాలు ... రెస్పాండెంట్లు.

5,6 రెస్పాండెంట్లకు అపిల్ నోటీస్

5) గోంతిన వరహా నర్సింగరావు నాయుడు, తండ్రి అప్పారావు. హిందూ, వయసు 49 సంవత్సరములు, డోర్ నెంబర్ 3-111, చినగంట్యాడ, గాజువాక, విశాఖపట్నం.
6) పనగిపల్లి విశ్వనాథం, తండ్రి వెంకట సూర్యనారాయణ మూర్తి, హిందూ, వయసు 59 సంవత్సరములు, నివాసం MIG-II, ఫ్లాట్ నెంబర్. S/2, విశ్వేశ్వరయ్యనగర్, ఆటోనగర్, గాజువాక, విశాఖపట్నం.

పై నెంబరు అపీలు I.A 388/2019లో పైకోర్టు వారు పంపిన నోటీసులు మీరు అందుకోనందున, సదరు కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **23-10-2025వ తేదీకి** వాయిదా వేసి ఉన్నారు. కావున ఆరోజు **ఉదయం 10:30** నిమిషములకు మీరు స్వయంగా లేక మీ తరుపున లాయర్ గారు గానీ పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొన వలెను, లేనిచో మీ పరోక్షమందు పై నెంబర్ అపీలు తీర్మానించబడును.

K.J.V. L.N.P. రత్నం (జ్యోతి)
K.రాజు
అడ్వకేట్స్, గాజువాక.

91 మందికి ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి -పద్మనాభం.: మండలంలోని విలాస్‌ఖాన్ పాలెం గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 91మంది రోగులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. విజయనగరానికి చెందిన శ్రీసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో డాక్టర్ వి.సంధ్య పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. శిబిరంలో గ్రామ పెద్దలు బి సన్యాసినాయుడు, కె. శ్రీనివాసరావు, ఆర్ ముత్యాల నాయుడు పాల్గొన్నారు.

అడ్డగోలుగా కార్మికుల శ్రమ దోపిడీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: కెజిహెచ్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను సంబంధిత కాంట్రాక్టర్ అడ్డంగా దోచుకుంటున్నాడని, విశాఖ జిల్లా ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రుల వర్కర్స్ యూనియన్, సిఐటియు ప్రధాన కార్యదర్శి కర్రి చంద్రశేఖర్ ఆరోపించారు.నెలనెలా జీతాలు కార్మికుల అకౌంట్లకు వేయడం లేదన్నారు. ఏదైనా కారణాలతో కార్మికులు 10 రోజులు పనిచేస్తే దానికి సంబంధించి జీతం వేయడం లేదన్నారు. ఇదేమని అడిగితే ఉద్యోగాల నుండి అక్రమంగా తొలగిస్తున్నాడని ఆరోపించారు. కార్మికుల ఇఎస్ఐ, పిఎఫ్ సరిగ్గా కట్టడం లేదన్నారు. కెజిహెచ్ అధికారులు, కార్మిక నాయకులు అండతో పారిశుధ్య కాంట్రాక్టర్, కార్మికుల శ్రమను దోచేస్తున్నాడని, ఇంతజరిగినా అధికారులెవరూ పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. కార్మికులకు గ్లౌజులు, మాస్కులు వంటి భద్రతా పరికరాలు ఇవ్వకుండాపనిచేయిస్తూ, వారి ఆరోగ్యాలతో ఆటలాడుకుంటున్నాడని ఆరోపించారు.

ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం కెజిహెచ్ సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌తో సహా మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ ప్రాంతాలలో 400 మంది పారిశుధ్య కార్మికులు అవసరమైతే, తక్కువ మందితో పనులు చేస్తూ వారిపై పని భారం పెంచుతున్నాడన్నారు. కాంట్రాక్టర్ పెట్టిన బిల్లులకు అధికారులు కళ్ళు మూసుకుని సంతకాలు పెడుతూ పాస్ చేస్తుండడంతో అతని ఆగడాలకు అడ్డులేకుండా పోతోందన్నారు. ఇప్పటికైనా కెజిహెచ్ అధికారులు స్పందించి, క్రిస్టల్ కాంట్రాక్టర్ చేస్తున్న అక్రమాలు, మోసాలపై తగు చర్యలు తీసుకోవాలని, కార్మికుల భద్రత కల్పించే చర్యలు చేపట్టేలా కాంట్రాక్టర్‌ను ఆదేశించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -తగరపువలస : గోస్తనీ నదిలో తమ్మిన శ్రీను మృతదేహం శుక్రవారం ఉదయం లభ్యమైంది. మంగళవారం తన బావమరిది అంత్యక్రియల్లో పాల్గొన్న శ్రీను, గోస్తనీలో స్నానం చేస్తుండగా, ప్రవాహ ఉధృతికి గల్లంతయ్యాడు. మూడురోజులుగా ఎన్‌డిఆర్ఎఫ్, పోలీసు బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు .శుక్రవారం ఉదయం సంఘటన జరిగిన ప్రాంతం నుండి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో మూలకుద్దు సుత్తమ్మ తల్లి ఆలయం సమీపంలో శ్రీను మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి సిహెచ్‌సికి తరలించారు .కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

లిక్విడ్ గంజాయితో నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి -గాజువాక : లిక్విడ్ గంజాయి రవాణా చేస్తున్న ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని గాజువాక పోలీసులకు శుక్రవారం రాత్రి తరలించారు. దీనికి సంబంధించిన వివరాలివి. గాజువాక శ్రీనగర్ గార్బేజ్ వెహికల్ దగ్గర అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద తనిఖీ చేయగా నాలుగు లీటర్ల హ్యాష్ ఆయిల్ (లిక్విడ్ గంజాయి) పట్టుబడింది. గంజాయితోపాటు రెండు బైక్‌లు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చీడికాడకు చెందిన కురచ హేమకుమార్, కొలుపూరి వరాహమూర్తి, కురచ సంజీవ్, జి మాడుగులకు చెందిన వంతల కొండబాబును అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాలిథిన్ సంచులు వినియోగిస్తే జరిమానా

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో పాలిథిన్ సంచులు వినియోగించినా, షాపుల వద్ద డస్ట్ బిన్లు ఉపయోగించక పోయినా రూ.వెయ్యి నుంచి రూ. ఐదు వేల వరకు జరిమానా విధించనున్నట్లు జెడ్‌సి ఒమ్మి అయ్యప్ప నాయుడు శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు నిబంధనలు పాటించకుంటే సంబంధిత దుకాణం ట్రేడ్ లైసెన్స్ రద్దు చేస్తామని, షాప్ సీజ్ చేస్తామని సూచించారు

జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపిక

విద్యార్థులను అభినందిస్తున్న జగన్నాథ్

ప్రజాశక్తి-మధురవాడ: స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రేపల్లిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-14 పోటీల్లో మధురవాడ యూత్ తైక్వాండో అకాడమీ క్రీడాకారులు ప్రతిభను కనపరిచారు. ఈ పోటీల్లో మద్దు గాయత్రి స్వర్ణం, పిల్లా సుధీర్ రజత పతకంతో సత్తాచాటి జాతీయ పోటిలకు ఎంపికైనట్లు కోచ్‌లు సురేష్, సుకుమార్ సంపత్ తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులకు కె. జగన్నాథ్ పతకాలు అందజేసి, మరిన్ని విజయాలు సాధించాలని ప్రోత్సహించారు. క్రీడాకారులను తల్లిదండ్రులతో పాటు పలువురు అభినందించారు.

19న ఆర్గానిక్ ఉత్పత్తుల సంత

ప్రజాశక్తి- సీతమ్మధార : ఈనెల 19న ఆదివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆంధ్రా యూనివర్సిటీ నార్త్ క్యాంపస్‌లో నిర్వహించే విశాఖ ఆర్గానిక్ సంతను జయప్రదం చేయాలని భారతీయ కిషాన్ సంఘ్ కేంద్ర కమిటీ సభ్యులు జలగం కుమారస్వామి కోరారు. శుక్రవారం సీతమ్మధార తహశీల్దార్ కార్యాలయం దరి కేశవ నికేతన్ గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘ సమావేశంలో మాట్లాడుతూ. ఎటువంటి హానికర రసాయనాలు వాడకుండా, పూర్తి సేంద్రీయ పద్ధతిలో పండించిన బియ్యం, పప్పులు, కూరగాయలు, చెక్క గానుగ నూనెలు, బెల్లం, ఖాదీ, చేనేత వస్త్రాలు సంతలో అమ్మకానికి అందుబాటులో ఉంటాయన్నారు. అలాగే కంపోస్టింగ్, టెర్రస్ గార్డెన్, బయో ఫెర్టిలైజర్స్, హస్తకళలు మొదలైన వాటిపై వర్క్ షాప్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, కార్యదర్శి పాలెం నేచురల్స్ అశోక్ పాల్గొన్నారు.

జీవనోపాధికి రక్షణ కల్పించండి

సిఐటియు ఆధ్వర్యాన చిరు వర్తకుల నిరసన

జివిఎంసి జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న చిరు వర్తకులు

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది వేధింపులతో చిరువర్తకుల బతుకులు దినదినగండంగా మారాయని సిఐటియు నాయకులు పి.రాజుకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల తీరును నిరసిస్తూ శుక్రవారం జివిఎంసి జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాజుకుమార్ మాట్లాడుతూ, మిథిలాపురి వుడా కాలనీ రోడ్డు మార్జిన్‌లో ఎవరికి ఇబ్బంది లేకుండా జీవనోపాధికి వ్యాపారాలు చేసుకుంటున్న చిరు వర్తకుల వద్ద ప్రతిరోజూ జివిఎంసి సిబ్బంది వచ్చి, అప్పులు చేసి, అమ్మకానికి తెచ్చుకున్న సరుకులను నిస్సిగ్గుగా ఎత్తుకుపోతున్నారని మండిపడ్డారు. ఇదేమిటని ప్రశ్నిస్తే చిల్లర వర్తకులను వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబపోషణకు చిల్లర వర్తకం తప్ప మరో ప్రత్యామ్నాయం లేని వ్యాపారులంతా మానసిక వేదనకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు.ఇదే పరిస్థితి కొనసాగితే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్ ఆదినారాయణ, రఘు, పి.వరలక్ష్మి, ధనుంజయరావు. కామేశ్వరరావు పాల్గొన్నారు.

విమ్స్ డైరెక్టర్‌కు ఘన సత్కారం

విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబును సత్కరిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి -ఆరిలోవ : విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబును శుక్రవారం ఆసుపత్రి సిబ్బంది ఘనంగా సత్కరించారు. విమ్స్ ఆస్పత్రి అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ఐదేళ్లుగా పెండింగ్ ఉన్న పీఎఫ్ డబ్బులను డాక్టర్ రాంబాబు చొరవ చూపి, వారి ఖాతాలో జమ చేసినందుకు కృతజ్ఞతగా ఆసుపత్రి సమావేశ మందిరంలో సన్మానించారు. డైరెక్టర్ రాంబాబు ఆధ్వర్యంలో విమ్స్ ఆస్పత్రిలో పనిచేయటం సంతోషమని హర్షం వెలిబుచ్చారు. ఆయన డైరెక్టర్ అయిన తరువాత ఆసుపత్రి అభివృద్ధితో పాటు సిబ్బంది యోగక్షేమాలను చూసుకుంటూ వస్తున్నారని కొనియాడారు. ఆస్పత్రికి గానీ, సిబ్బందికి గానీ ఎటువంటి సమస్య వచ్చినా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, అక్కడున్న సత్సంబంధాలతో త్వరితగతిన పరిష్కరిస్తున్నారని కొనియాడారు. డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, ఆర్ఎంవో డాక్టర్ శిరీష, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ బాధ్యత, ఆస్పటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ మనోజ్ పాల్గొన్నారు.

ఎంపీ శ్రీభరత్‌కు అభినందన

శ్రీభరత్‌ను అభినందిస్తున్న శ్రావణి

ప్రజాశక్తి- సీతమ్మధార: ఐక్యరాజ్యసమితిలో భారత్ తరపున ప్రాతినిధ్యం వ్యహించి, విశాఖకు గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుపై ఒప్పందం కుదిరిన తర్వాత మొదటి సారిగా విశాఖపట్నం విచ్చేసిన విశాఖ ఎంపీ శ్రీభరత్‌ను విశాఖ విమానాశ్రయంలో పలువురు ఘనంగా స్వాగతించారు. 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, వార్డు అధ్యక్షులు ముక్కా కిషోర్ కుమార్ తదితరులు ఎంపీ శ్రీభరత్‌ను స్వాగతించి, కండువాతో సత్కరించి, జాతీయచిహ్నం అశోకుని ధర్మచక్రం, నాలుగు సింహాలున్న ధర్మ స్థూపాన్ని అందజేసి అభినందనలు తెలిపారు.

బలవంతపు భూసేకరణ దుర్మార్గం

ప్రజాశక్తి- ఆనందపురం : గూగుల్ డేటా సెంటర్ కోసం మండలంలోని తర్లువాడ దళిత రైతుల పచ్చని పంటపొలాలను బలవంతంగా లాక్కోవాలనుకోవడం కులదురంకారంతో కూడిన దుర్మార్గమైన నిర్ణయమని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మండిపడ్డారు. శుక్రవారం గూగుల్‌కు కేటాయించిన భూములను దళిత రైతులతో కలిసి పరిశీలించారు 1971లో ఇందిరాగాంధీ హయాంలో తర్లువాడలో ఒక్కో దళిత రైతుకు రెండెకరాల డిపట్టా భూములకు పట్టాలిచ్చారని, నాటి నుంచి వ్యవసాయం, తోటల పెంపకంతో వచ్చిన ఫలసాయంతో జీవనోపాధి పొందుతున్నారన్నారు. ఇపుడా భూములను కార్పొరేట్ కంపెనీకి కట్టబెట్టి, దళితుల కడుపు కొట్టడం సరికాదన్నారు. దీనిపై తహశీల్దార్ ఆర్డిఒ, జిల్లా కలెక్టర్లు ఒత్తిడి తేవడం సరికాదన్నారు. భూములివ్వకుంటే బలవంతంగా లాక్కొంటామంటూ కలెక్టర్ వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. డేటా సెంటర్ ఏర్పాటుతో తర్లువాడ చుట్టుపక్కలా పది కిలోమీటర్లమేర నీటి కొరత,

తర్లువాడలో భూములను పరిశీలిస్తున్న మాల్యాద్రి

భూగర్భ జలాల కాలుష్యం, పర్యావరణ నాశనం వంటి ప్రమాదాలు సంభవించే అవకాశముందని హెచ్చరించారు. తక్షణమే ప్రభుత్వం నిర్ణయం మార్చుకోకుంటే మండల, జిల్లా రాష్ట్రస్థాయిలో ఆందోళన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ విశాఖ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.సుబ్బన్న, చిరంజీవి పాల్గొన్నారు.

భవిత విద్యార్థులకు సామగ్రి పంపిణీ

సామగ్రి అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు, గ్రామపెద్దలు

ప్రజాశక్తి- ఆనందపురం: మండలంలోని భవిత కేంద్రంలో చదువుతున్న వికలాంగ విద్యార్థులకు శుక్రవారం విద్యా సామగి, పుస్తకాలు, ఇతర వస్తువులను బిఎస్ఆర్ విఆర్ ఫౌండేషన్ ద్వారా శుక్రవారం పంపిణీ చేశారు.మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి, పిల్లలకు రక్షిత తాగునీటిని చెన్నా ప్రగడ సిస్టర్స్, బిఎస్ఆర్ విఆర్ ఫౌండేషన్ సహకారంతో సమకూర్చారు. ఈ సందర్భంగా ఎంఇఒ వి. జోగేంద్రనాథ్ మాట్లాడుతూ, విద్యార్థులకు అందించిన సహకారానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తాము అందించిన సహాయంతో విద్యార్థుల చదువు, వ్యక్తిత్వాభివృద్ధిలో ప్రేరణగా మారాలని, ఇతరులకు సేవ చేయడం ద్వారా సమాజానికి సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.పైడి రాజు, ఉపాధ్యాయులు కె.సుబ్బలక్ష్మి, జి.వి.ప్రవీణ్, యు.ఉదయరాణి, సహిత విద్యా ఉపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, ఐ.నాగమణి పాల్గొన్నారు.

సింహాద్రి అప్పన్న ఆలయ పైకప్పు పునరుద్ధరణ

ప్రజాశక్తి- వేపగుంట : చారిత్రక ప్రసిద్ధి చెందిన సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవాలయం మరోసారి తన పురాతన వైభవాన్ని చాటుకుంది. శతాబ్దాల నాటి ఆలయ పైకప్పు పునరుద్ధరణ పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. పూణేకు చెందిన వెంకటేశ్వర ఆధ్యాత్మిక చారిటబుల్ ట్రస్టు రూ.5 కోట్ల వ్యయంతో, నాలుగు నెలల పాటు అవిరళకృషి చేసి వీటిని పూర్తి చేశారు. పనులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు

స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రత్యేక చొరవ, ఆలయ ఇఒ వేండ్ర త్రినాథరావు సమన్వయంతో ఆలయ పైకప్పు పునరుద్ధరణ అద్భుతంగా పూర్తయినట్లు అధికారులు తెలిపారు. పురావస్తు శాఖ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి పర్యవేక్షణలో పురాతన శిల్పకళా శైలిని అనుకరిస్తూ, సున్నం, బెల్లం, కర్రాతి మిశ్రమాలతో రూపొందించిన ప్రత్యేక పద్ధతిని ఉపయోగించి పునరుద్ధరణ పనులు శాస్త్రీయ పద్ధతుల్లో పూర్తిచేశారు. తద్వారా మరో రెండు దశాబ్దాలపాటు ఆలయం చెక్కుచెదరే పరిస్థితి ఉండదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు..విజయోత్సవంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఆలయ ఇఒ వేంద్ర త్రినాధరావు, కార్పొరేటర్ పివి నరసింహం పురావస్తు శాఖ అధికారులు, ఆలయ ఇంజినీరింగ్ విభాగం,, ఆలయ అధికారులు సాంస్కృతిక ప్రతినిధులు, ఆలయ అర్చకులు వేదపండితులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ మెగా రక్తదాన శిబిరం

● ఎయు విద్యార్థుల నుంచి విశేష స్పందన

భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విసి రాజశేఖర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం శత జయంతోత్సవాలను పురస్కరించుకుని ఎస్ఎఫ్ఐ ఆంధ్ర యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో వర్సిటీలోని టిఎల్ఎన్ సభా హాల్‌లో భగత్‌సింగ్ మెగా రక్తదాన శిబిరాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వర్సిటీ విసి డాక్టర్ జిపి.రాజశేఖర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. ఇటువంటి మానవతావాద కార్యక్రమాలువిశ్వవిద్యాలయ సంస్కృతిని ప్రతిబింబి స్తాయని తెలిపారు. శతాబ్ది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు విద్యార్థుల నుంచి సంపూర్ణ సహకారం కోరారు. విద్యార్థులు భగత్ సింగ్ వంటి స్వతంత్ర సమరయోధులను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ఎయు వందేళ్ల ఉత్సవాలలో భాగంగా భగత్ సింగ్ మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన ఎస్ఎఫ్ఐ ఎయు కమిటీని ప్రశంసించారు. మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు, సమాజానికి బాసటగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో 126 మంది యూనివర్సిటీ విద్యార్థులు రక్తదానం చేయగా వారికి విసి సర్టిఫికెట్లు అందించి అభినందించారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్ మాట్లాడుతూ భగత్ సింగ్ వంటి విప్లవ యోధుని స్ఫూర్తిని నేటి యువతలో నింపే ప్రయత్నంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించే దిశగా తాము కృషి చేస్తున్నా మన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, అధ్యక్షులు జి.అజయ్, యూనివర్సిటీ కమిటీ కార్యదర్శి డి.వెంకటరమణ, అధ్యక్షులు ఎం.కుసుమాంజలి, నాయకులు ప్రగతి, సోమేష్, తరుణ్, హరిణి, హర్షిత్, నరేష్, సునీల్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ వద్దు

టిడిపి కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి

ప్రజాశక్తి -గాజువాక : పెదగంట్యాడ ప్రాంతంలో అదానీ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటును రద్దు చేయాలని టిడిపి కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అన్నారు. శుక్రవారం 75వ వార్డు సీకువానిపాలెంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అంబుజా సిమెంట్ ప్యాక్టరీ ఏర్పాటుతో కలిగే ఇబ్బందులపై అవగాహనా సదస్సు నిర్వహించారు. స్థానికులంతా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ప్రజారోగ్యం, వారి మనోభావాలను గుర్తించి ఇక్కడ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రతిపాదన విరమించుకోవాలన్నారు .దీనిపై ఇప్పటికే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. గ్రామపెద్దలు పిల్లి మహాలక్ష్మీ, అండిబోయిన రాము నాయుడు సారిపల్లి నాయుడు, అప్పారావు, అప్పలరాజు, చిన్న, నాయకులు భాస్కరరావు పాల్గొన్నారు.

పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వం వెంటనే పిఆర్‌సిని ప్రకటించాలని యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు కె.జగన్మోహన్‌రావు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావొస్తున్నా ఉద్యోగులకు ఇవ్వవలసిన ఆర్థిక బకాయిలను నేటివరకూ చెల్లించకపోవడం విచారకరమన్నారు. శుక్రవారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల ఆశల మీద కూటమి సర్కారు నీళ్లు చల్లుతోందన్నారు. ఇప్పటికీ 5 డిఎలు, 4 సరెండర్ లీవులు, ఐఆర్, పిఆర్‌సి ఇలా అన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. ప్రభుత్వ తీరుపై సచివాలయ ఉద్యోగులు, పిహెచ్‌సిల వైద్యులు ఆందోళన బాట పట్టారని తెలిపారు. సమస్యలను పరిష్కరించకుంటే పోరాటం మున్ముందు మరింత తీవ్రమవుతుందని హెచ్చరించారు.

వైఎస్ఆర్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకటరెడ్డి

బూమిరెడ్డి వెంకటరెడ్డి

ప్రజాశక్తి - ఆరిలోవ : వైఎస్ఆర్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శిగా 13వ వార్డుకు చెందిన వైసిపి సీనియర్ నాయకులు బూమిరెడ్డి వెంకటరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ, అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనకు పదవి రావడంతో అధినేత జగన్మోహన్‌రెడ్డితోపాటు, ఉత్తరాంధ్ర కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, జిల్లా అధ్యక్షులు కె.కె.రాజు, తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ ఇన్‌ఛార్జి రవిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

అనుమతుల్లేకుండా టెండర్లు ఎలా వేస్తారు?

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు

ప్రజాశక్తి-యస్.రాయవరం : బల్క్ డ్రగ్ పార్కుకు సిఆర్‌జెడ్, కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ అనుమతులు లేకుండా టెండర్లు ఏ విధంగా పిలుస్తారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు ప్రశ్నించారు. మండలంలో ధర్మవరం అగ్రహారంలో అప్పలరాజును రాజయ్యపేట మత్స్యకార నాయకులు కలిశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అప్పలరాజు మాట్లాడుతూ బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయొద్దని ఆందోళన చేస్తున్న మత్స్యకారుల డిమాండ్ మేరకు పనులు ఆపిస్తామని మంత్రి అనిత, కలెక్టర్ ఒక వైపు చెబుతూనే, మరో వైపు బల్క్ డ్రగ్ పార్క్‌లో ఏర్పాటు చేసే కంపెనీలు విడుదల చేసే వ్యర్థ జలాలను సముద్రంలోకి వదలడానికి పైపులైన్ల నిర్మాణానికి టెండర్ పిలవడానికి నోటిఫికేషన్ జారీ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. 35 రోజులుగా మత్స్యకారులు వేటకు, పనులకు వెళ్లకుండా ఆందోళన చేస్తుండగా, వారి మనోభావాలు, అభిప్రాయాలను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోకుండా ఈ విధంగా టెండర్లు పిలవడం అత్యంత మోసపూరితమని పేర్కొన్నారు. మత్స్యకారుల చేస్తున్న పోరాటం పర్యావరణాన్ని, ప్రజలు ప్రాణాలు, మత్స్యకారుల ఉపాధిని కాపాడేందుకు జరుగుతున్న పోరాటమని తెలిపారు. దీని లోతు పాతలను ప్రభుత్వం గుర్తించకుండా ఎవరో బయట వ్యక్తుల రెచ్చగొట్టడం వలన జరుగుతున్న పోరాటంగా చెబుతూ సమస్యను పరిష్కారం చేయకుండా తప్పించుకోవడానికి ప్రత్నించడం దారుణమన్నారు. వెంటనే మెరైన్ అవుట్ పాల్ టెండర్లు నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వై.నగేష్, సిహెచ్.సోమేష్, బి.నూకరాజు, టి.మాధవ, కె.వెంకటేష్, ఏ.మాధవ, సిహెచ్.కాశీ, డి.నానాజీ, రామ్‌చరణ్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం నేత అప్పలరాజును కలిసిన రాజయ్యపేట మత్స్యకార నాయకులు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నేత గనిశెట్టి, మత్స్యకారులు

బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలి

ప్రజాశక్తి-పరవాడ : బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలని కోరుతూ మండలంలోని ముత్యాలంపాలెం గ్రామంలో సిఐటియు, మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యమ పోస్టరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ రాజయ్యపేటలో నెల తరబడి సెక్షన్-30ని అమలు చేస్తున్నారని, పోలీసు పికెట్లు పెట్టి ప్రజానీకాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. పోరాటానికి మద్దతు తెలుపుతున్న సిపిఎం నాయకులను గృహ నిర్బంధం చేస్తున్నారని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామం చుట్టూ పోలీసు పహరా పెట్టి, ప్రజలపై నిర్బంధం ప్రయోగించి, వారు జీవించే హక్కును, నిరసన చేసే హక్కును ఖూనీ చేశారని పేర్కొన్నారు. విషతుల్య పరిశ్రమలకు తాను వ్యతిరేకమని, బల్క్ డ్రగ్స్ పార్కు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించనని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన హోంమంత్రి అనిత నేడు బల్క్ డ్రగ్స్ పార్కును వత్తాసు పలకడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పోలీసు నిర్బంధాన్ని ఎత్తివేయాలని, ప్రజాభీష్టం మేరకు బల్క్ డ్రగ్స్ పార్కు ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం నాయకులు బి బంగారి, సొరడ రామ్మూర్తి, రాజీ అమ్మ, పోచమ్మ కోవిరి రావులమ్మ తదితరులు పాల్గొన్నారు.

మెటీరియల్ పంపిణీ చేసిన జెవివి నాయకులు

ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఎన్ఎంఎంఎస్ పరీక్షకు హాజరు కానున్న 8వ తరగతి విద్యార్థులకు శుక్రవారం జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు మారిశెట్టి వెంకట అప్పారావు, ఉప్పాడ రాము, బొడ్డేడి రామ్ కుమార్ చేతుల మీదుగా మెటీరియల్ అందజేశారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ, విద్యావేత్త కె లక్ష్మణరావు రూపొందించిన ఈ మెటీరియల్ మండలంలోని అన్ని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేస్తామని వారు తెలిపారు. మెటీరియల్‌ను ఎంఇఒ సిఆర్‌కె దేవరాయలు చేతులు మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీపాద రవి, ఎం.పద్మావతి, కల్పన, మారిశెట్టి కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలు

ప్రజాశక్తి-పరవాడ : అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని సబ్బవరం ఐ.సి.డి.ఎస్ ఆధ్వర్యంలో పరవాడ మండల పరిధిలో వున్న బాలికల ఉన్నత పాఠశాలల్లో బాలికలకు ఆటలు, వ్యాసరచన, డిబేట్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం కూటమి నేతలు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు మోటూరి సన్యాసినాయుడు, చింతకాయల సుజాత, బండారు కల్పన, వియ్యపు చిన్న, తహసిల్దార్ నాగరాజు, ఎంపిడివో రమేష్ నాయుడు, సిడిపిఒ లలిత కుమారి, సూపర్ వైజర్లు శ్యామల కుమారి, రమణి, లక్ష్మి, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

రోడ్లపైనే మురుగునీరు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని చంద్రయ్యపేట దళిత కాలనీలో మురుగునీరు బయటకు పోయే మార్గం లేక రోడ్డుపైనే నిల్వ ఉండటంతో దోమలతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు అంటున్నారు. ఇరు పక్కల కాలువలు ఏర్పాటు చేయాలని సర్పంచ్‌ను, పంచాయతీ కార్యదర్శితో చెప్పినా ఫలితం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మురుగునీరు దుర్వాసనతో అంటురోగాల బారిన పడతామని ఆందోళన చెందుతున్నారు. తక్షణమే మురుగునీటిని తొలగించి కాలువలు నిర్మించాలని సిఐటియు మండల కార్యదర్శి ఈర్లే నాయుడు బాబు అధికారులను కోరారు.

చంద్రయ్యపేట దళిత కాలనీలో రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు

జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి

ఉద్యోగుల సమస్యలు తెలుసుకుంటున్న జెసి జాహ్నవి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉద్యోగుల వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్ జాహ్నవి, డిఆర్వో వై.సత్యనారాయణరావు ఉద్యోగుల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రతి ఒక్కరి సమస్యను జాయింట్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. న్యాయమైన, పరిష్కరించుటకు అవకాశం గల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఈ ప్రత్యేక గ్రీవెన్స్‌లో 11 మంది ఉద్యోగులు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ కార్యాలయ పరిపాలన అధికారి విజయ్ కుమార్, పిజిఆర్ఎస్ సెల్ పర్యవేక్షకుడు సురేష్ నాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో.....

"పోలీస్ వెల్ఫేర్ డే" కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి విజ్ఞాపనను సానుకూలంగా పరిశీలించి, సమస్య పరిష్కారం వరకు పర్యవేక్షిస్తామన్నారు. సిబ్బంది నిర్మొహమాటంగా తమ సమస్యలను తెలియజేయాలని సూచించారు. ఎస్పీ తన చాంబర్‌లో సిబ్బందిని వ్యక్తిగతంగా పిలిపించి, వారి అభ్యర్థనలను స్వీకరించారు.

రామ్‌కో సిమెంట్‌కు నాణ్యతా ప్రమాణాల అవార్డు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలంలోని ఎ.ఎస్.పేట వద్ద ఉన్న రామ్‌కో సిమెంటు కర్మాగారానికి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ అవార్డు లభించింది. సిమెంట్ తయారీలో అత్యున్నత నాణ్యత ప్రమాణాలు పాటించి నాణ్యమైన సిమెంట్ అందిస్తున్నందుకు ఈ అవార్డు వచ్చినట్లు యూనిట్ హెడ్ సికిందర్ బాషా శుక్రవారం తెలిపారు. ఈ మేరకు విజయవాడలో బీఐఎస్ డైరెక్టర్ ప్రేమ సజని పట్నాల చేతుల మీదుగా ప్లాంట్ డీజీఎం, ప్రాసెస్, క్వాలిటీ హెడ్ సిహెచ్.సురేష్ కుమార్ అవార్డును స్వీకరించారు.

అవార్డు అందుకుంటున్న సురేష్‌కుమార్

జర్నలిస్టుల నిరసనలు

ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి-అనకాపల్లి : నెల్లూరు జిల్లాలోని సాక్షి కార్యాలయంపై దాడులు, అక్రమ కేసులకు నిరసనగా అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం వద్ద శుక్రవారం జర్నలిస్టులు నిరసన కార్యక్రమం చేపట్టారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని, అక్రమ కేసులను ఎత్తివేయాలని నినాదాలు చేశారు. ఆర్డీవో ఆయేషాకు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులు ఆళ్ల వెంకటప్పారావు, రామచంద్రరావు, మళ్ల భాస్కరరావు, భీమరశెట్టి గణేష్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : సాక్షి పాత్రికేయులపై దాడి అప్రజాస్వామ్యమని స్థానిక ప్రెస్ క్లబ్ సభ్యులు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం తహశీల్దారు సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పాత్రికేయులు దాడి అరుణ్ కుమార్, వెలగా జగదీష్, భీమరశెట్టి వెంకటేష్, సబి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల : ఎపి వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యాన మాడుగుల పోలీస్ సిబ్బందికి జర్నలిస్టులు పత్రం అందజేశారు. పాత్రికేయులు రొబ్బ శ్రీను, ఏలూరి సురేష్, కుప్పిలి భవాని శంకర్, తాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్ : ఏపీయూడబ్ల్యూజే నర్సీపట్నం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన నిర్వహించారు. సిహెచ్‌బిఎల్ స్వామి, ఎడి బాబు, సకిరెడ్డి నానాజీ, విజయ్ పాల్గొన్నారు

ఆదాయ వనరుల పెంపుతోనే అభివృద్ధి

ప్రజాశక్తి-కోటవురట్ల : గ్రామీణ ప్రాంతాలలో వివిధ వాణిజ్య, చిన్న తరహా పరిశ్రమలు, వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారాల ద్వారా ఆదాయ వనరులు సమకూర్చుకుంటేనే గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయని ఎంపిడిఒ చంద్రశేఖర్ అన్నారు. పంచాయతీల సొంత ఆదాయ వనరులు పెంపుపై స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచ్, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే వ్యాపారాలతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల నుండి కూడా వనరులు సమకూర్చుకోవాలన్నారు. పంచాయతీ పరిధిలో లేఅవుట్లు క్రమబద్ధీకరణ, పంచాయితీ ఎప్రూవల్స్ వంటి వాటి పట్ల తూచా తప్పకుండా నిబంధనలు ప్రకారం అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. చిన్న బొడ్డేపల్లి సర్పంచ్ శివప్రసాద్ మాట్లాడుతూ మద్యం బెల్ట్ షాపుల ద్వారా అత్యధికంగా గ్రామాలలో లావాదేవీలు జరుగుతున్నాయని, వాటి పట్ల ఏ మేరకు చర్యలు తీసుకోవాలో తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కూర్మారావు, ఏపీవో నాగరాజు, పలువురు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని మొగలిపురం గ్రామంలో ఈ నెల 16న ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తున్న గొర్లి దేముడును అరెస్టు చేసినట్లు స్థానిక సిఐ జి.రామచంద్రరావు తెలిపారు. ఈ మేరకు నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

జాక్ అండ్ జిల్ స్కూల్లో గ్రీన్ డే

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : స్థానిక జాక్ అండ్ జిల్ ఇంగ్లీష్ మీడియం యుపి స్కూల్‌లో శుక్రవారం గ్రీన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లక్ష్మీ ఆకు కూరలలో ఉండే ఆరోగ్య రహస్యాలు, అడవుల ప్రాముఖ్యత, మొక్కలను పెంచడం వలన కలిగే లాభాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాదేవి, దేవి, నీలిమ, వెంకట లక్ష్మీ సంగీత తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ డే వేడుకలు నిర్వహిస్తున్న పాఠశాల సిబ్బంది

చేనేత మగ్గాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ చంద్రశేఖర్

చేనేత సొసైటీని సందర్శించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి-కోటవురట్ల : మండలంలోని కైలాసపట్నం రాజగోపాల చేనేత సొసైటీని శుక్రవారం ఎంపీడీవో చంద్రశేఖర్ పరిశీలించారు. చేనేత కార్మికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకం లేకపోవడంతో చేనేత ఉత్పత్తులు చేయలేకపోతున్నామంటూ పలువురు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామంలో 75 కుటుంబాలు వరకు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నట్లు సంఘ సభ్యులు వంకల వెంకట్రావు తెలిపారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఎంపిడిఒ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, పంచాయితీ కార్యదర్శి రఘురాం, కార్యదర్శి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఉత్పాదకత పెంపు సాధనాలు' పై వర్క్‌షాప్

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఉత్పాదకత పెంపు సాధనాలు అన్న అంశంపై శుక్రవారం వర్క్ షాప్ నిర్వహించారు. జి శిరీష ట్రైనర్‌గా విచ్చేశారు. సమయ నిర్వహణ సాధనాలు పని, ప్రాజెక్టు నిర్వహణ సాధనాలు సంవేదన, సహకార సాధనాలు డాక్యుమెంటు, నోట్స్ సాధనాలు ఫైల్స్ నిల్వ, ఆటోమేషన్ సాధనాలు వలన సమయాన్ని ఆదా చేయవచ్చునని పేర్కొన్నారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ విద్యాభ్యాసం, పరిశ్రమ అంచనాల మధ్య అంతరాన్ని తగ్గించడంలో ఇటువంటి సెమినార్లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపల్ గణేష్ రెడ్డి, వర్క్ షాప్ కన్వీనర్ డాక్టర్ కే సుజాత, పాలిటెక్నిక్ కోఆర్డినేటర్ సరిత రాణి, హెడ్ ఆఫ్ సెక్షన్ కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం శనివారం జరుగుతుందని చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి సభ్యులకు, అధికార్లకు నోటీసులు జారీ చేశారు. ఉదయం 11 గంటలకు సంబంధిత కౌన్సిలర్లు, అధికార్లు సమావేశానికి హాజరు కావాలని సూచించారు. కౌన్సిల్ సమావేశ మందిరం కూడా ప్రారంభోత్సవం జరుగుతుందని కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు.

బస్సు జాతా పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : విద్యారంగ సమస్యలపై ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం నుండి హిందూపురం వరకు అక్టోబర్ 22 నుండి నవంబర్ 12వ తేదీ వరకు జరిగే రాష్ట్రవ్యాప్త బస్సు జాత జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ పిలుపునిచ్చారు. అనకాపల్లి సిపిఐ కార్యాలయంలో శుక్రవారం గోడపత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో విద్యారంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎన్డీఏ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జగదీష్, సింహాద్రి, రాజు, కోదండరాం తదితరులు పాల్గొన్నారు.

డిసిసిబి చైర్మన్‌ను కలిసిన సత్యనారాయణ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ఉమ్మడి విశాఖ జిల్లా డీసీసీబీ చైర్మన్ కోన తాతారావును మండలంలోని తురకలపూడి కో-ఆపరేటివ్ చైర్మన్ కోట సత్యనారాయణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సొసైటీలో సభ్య రైతుల సమస్యలను ఆయన తెలియజేశారు. సొసైటీ బలోపేతానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

డిసిసిబి చైర్మన్ కోన తాతారావును సత్కరించిన సత్యనారాయణ

నేడు ఎంపిపిపై అవిశ్వాస బలపరీక్ష

రెండు నెలల ఉత్కంఠకు తెర

ఎంపిపి గోవిందరావు, వైస్ ఎంపిపి-1 రాజాన శేషు

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి ఎంపిపి బోదెపు గోవిందరావుపై సభ్యులు ఇచ్చిన అవిశ్వాస నోటీసుపై శనివారం బలపరీక్ష జరగనుంది. దీని కోసం శనివారం సాయంత్రం 4 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారు. అందుకు తగిన ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంపిడిఓ కె.కొండలరావు తెలియజేశారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతున్న బలపరీక్షకు అనకాపల్లి ఆర్డీఓ షేక్ ఆయేషా హాజరై బలపరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. కేవలం ఓటు హక్కుగల ఆరుగురు సభ్యులను మాత్రమే సమావేశానికి అనుమతిస్తారని పేర్కొన్నారు.

ఇలా జరగొచ్చు....

అవిశ్వాసం నెగ్గితే ఎంపిపి గోవిందరావు తన పదవిని కోల్పోతారు. ఆ సంగతి ఆర్డీఓ జిల్లా పరిషత్ సిఇఒ, కలెక్టర్లకు తెలియజేస్తారు. తాత్కాలిక అధ్యక్షునిగా ప్రస్తుతం వైస్ ఎంపిపి-1గా ఉన్న రాజాన శేషును ప్రకటించవచ్చు. బలపరీక్ష శనివారం జరుగుతున్న కారణంగా ఆదివారం సెలవు, సోమవారం దీపావళి కారణంగా తాత్కాలిక అధ్యక్షుని విషయంలో జాప్యం జరిగితే జరగవచ్చు. తరువాత కలెక్టర్ సూచన మేరకు సమావేశం ఏర్పాటు చేసి కొత్త అధ్యక్షుని ఎన్నికల ప్రక్రియ జరుగుతుంది.

నిబద్ధత గల నాయకునిగా కొనసాగుతాను : గోవిందరావు

రాజకీయాల్లో నిబద్ధత గల నాయకుడిగా కొనసాగాలనుకుంటున్నట్లు ఎంపిపి గోవిందరావు ప్రజాశక్తికి తెలిపారు. పదవి కంటే పార్టీ గురించే త్యాగాలకు సిద్ధపడినట్లు చెప్పారు. ఎంపిపి జనరల్ కేటగిరిగా ప్రకటించినపుడు నాటి ఎమ్మెల్యే కన్నబాబురాజు సూచన మేరకు ఎంపిపిగా బరిలో దిగి నెగ్గినట్లు తెలిపారు. రాజాన శేషు, తనకు మధ్య విభేదాలు లేవని, ఆయన పార్టీ మారి ఎంపిపి పదవి ఆశించడంలో తప్పేం లేదని, ఆయన రాజకీయ భవిష్యత్తు ఆలోచనలు ఆయన ఇష్టమని పేర్కొన్నారు. జనసేన పార్టీలో చేరితే పూర్తికాలం ఎంపిపిగా కొనసాగతావుతావని, లేకపోతే ఎంపిపి పదవి చేజార్చుకుంటావని ప్రస్తుత ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ చెప్పారని, కాని జనసేనలో చేరడానికి తాను అంగీకరించలేదని తెలిపారు. దీని వెనుక కొన్ని రాజకీయ శక్తులు తనకు వ్యతిరేకంగా పనిచేసి ఇవాళ తనపై అవిశ్వాసం ప్రకటించాయని, ప్రజాస్వామ్య హక్కులకు కట్టుబడి పనిచేస్తానని, పదవి లేకున్నా మనశ్శాంతిగా రాజకీయాల్లో కొనసాగుతానని చెప్పారు.

సిజెఐ గవాయ్‌పై దాడి పట్ల నిరసనలు

ప్రజాశక్తి-సబ్బవరం : భారత సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్‌పై కోర్టులో రాకేష్ కిషోర్ అనే సీనియర్ న్యాయవాది బూటు విసిరి దాడి చేయడాన్ని ఖండిస్తూ ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యాన తహశీల్దారుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రాకేష్ కిషోర్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు దువ్వ దుర్గాలు, ఇండిగుబల్లి గోపి, నీటిపల్లి ముత్యాలరావు, మారెడుబూడి కోటి పాల్గొన్నారు.

కశింకోట : సిజెఐ దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ మండల తహశీల్దారు తిరుమలరావు ఎంఆర్‌పిఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కె.చిన్న అప్పారావు, చెవ్వేటి నాగరాజు, ముప్పిడి అప్పారావు, చేవ్వేటి అప్పలరాజు పాల్గొన్నారు.

యస్.రాయవరం : సిజెఐపై దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకోవాలని తహశీల్దారు రమేష్‌బాబుకు ఎంఆర్‌పిఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కోరుమిల్లి లోవరాజు, గంపల రాజు, కాపారపు ఆకాష్, చలికా గోవిందరావు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : సిజెఐపైదాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. డిప్యూటీ తహసిల్దార్ శ్రీరామమూర్తికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వరహాలు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : సిజెఐ గవాయ్‌పై ఇటీవల జరిగిన దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు తహశీసిల్దార్ కార్యాలయం ముందు నల్లజెండాలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇది ప్రజాస్వామిక విలువలు, రాజ్యాంగ వ్యవస్థపైనే దాడిగా అభివర్ణించారు.

చీడికాడ : సిజెఐపై దాడి వెనుక ఉన్న శక్తులకు గుర్తించి వారికి కూడా శిక్షలు పడేలా స్వతంత్ర దర్యాప్తు చేయాలని కోరుతూ ఎంఆర్పిఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. తహసీల్దార్‌కి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రావాడ దేముడు నాయుడు, మోర్తా శ్రీనివాసరావు, పెదపూడి మహాలక్ష్మి, ఐనీల్లి కొండమ్మ, పాల్గొన్నారు

పశువైద్యాధికారి నియామకానికి నివేదిక పంపించాం

- ప్రజాశక్తి కథనానికి స్పందించిన పశుసంవర్ధక శాఖ అధికారులు

ప్రజాశక్తి-వడ్డాది : వడ్డాది పశువైద్యశాలకు వైద్యాధికారి నియామకానికి సంబంధించి ఉన్నత అధికారులకు నివేదిక పంపించామని పశుసంవర్ధక శాఖ ఏడి శ్రీనివాసరావు తెలిపారు. పశువైద్యాధికారి లేక 'మూగజీవాలకు అందని వైద్యం' శీర్షికన ప్రజాశక్తిలో ఈనెల 12వ తేదీన ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. వ్యాధుల సీజన్ కావడంతో సెప్టెంబర్ 15 నుండి అక్టోబర్ 15వ తేదీ వరకు ప్రతి గ్రామంలోనూ పశువులకు గాలి కుంటి వ్యాధి నిర్ధారణ టీకాలు వేసామని తెలిపారు. అటెండర్‌కి ఆగస్టు నెల వరకు జీతాలు చెల్లించామన్నారు. తర్వాత నెల నుండి ప్రతినెల జీతాలు యధావిధిగా వేస్తున్నామని చెప్పారు. పశు జాతి అన్నిటికి గ్రామ సచివాలయ సిబ్బంది ఇదివరకే టీకాలు వేసినట్లు తెలిపారు.

జాతీయస్థాయి ఉషూ పోటీలకు ఎంఎఎల్ విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి : జాతీయస్థాయి ఉషూ పోటీలకు స్థానిక ఎఎంఎఎల్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల రాజమండ్రి ఎస్‌కేవిటి కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ -19 ఉషూ పోటీలలో ఏఎంఏఎల్ విద్యార్థులు ఎన్.తులసీరామ్, ఇ.లక్షిత్, ఏ.వరప్రసాద్ పాల్గొని విజయం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి జయబాబు తెలిపారు. వీరు త్రిపురలోని ఈటానగర్‌లో నవంబర్లో జరగబోయే పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం సదరు విద్యార్థులకు కళాశాల అధ్యక్షులు శ్రీధరాల కృష్ణపేర్రాజు, కరస్పాండెంట్ పెంటకోట వెంకట రామారావు, గవర్నింగ్ బాడీ మెంబర్స్ వి.బాలకృష్ణ, కె.రవీంద్ర, వి.కృష్ణ కిషోర్, వైస్ ప్రిన్సిపల్ టి.నిరంజన్ కుమార్, సూపరిండెంట్ పి. అనురాధ, ఫిజికల్ డైరెక్టర్ కెవీఎస్.నాయుడు, కే.శత్రుజ్ఞ, ఉషు కోచ్ డి.హరీష్ అభినందనలు తెలిపారు.

అక్రమ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న తహశీల్దారు చిన్నికృష్ణ

అక్రమ నిర్మాణాలు తొలగిస్తాం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అసకపల్లి పంచాయతీ పరిధిలో భూ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు తొలగించి, ఆక్రమణదారులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని స్థానిక తహసీల్దార్ బి. చిన్నికృష్ణ హెచ్చరించారు. అసకపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 1లో కొండ పోరంబోకు భూమిలో అక్రమ నిర్మాణాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసకపల్లి సర్వే నెంబర్ 1, సర్వే నెంబర్ 16లో ఆక్రమణలు గుర్తించినట్లు తెలిపారు. వాటిని తొలగిస్తామని స్పష్టం చేశారు. అసకపల్లి జగనన్న కాలనీ పక్కన ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని కొంతమంది ఆక్రమించి ఫెన్సింగ్ పోల్స్ వేసి రేకుల షెడ్లు నిర్మించినట్లు గుర్తించామని, ఆ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

బాధిత రైతులకు చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట : విశాఖ డెయిరీకి పాలు పోస్తున్న 29 మంది రైతులకు సంబంధించిన ఆవులు, గేదెలు మృతి చెందగా, బాధిత రైతులకు విశాఖ డెయరీ సంక్షేమ నిధి నుండి రూ.12.55 లక్షల చెక్కులను శుక్రవారం మండలంలోని నరసింగబిల్లి పాల కేంద్రం వద్ద విశాఖ డెయిరీ డైరెక్టర్ పిల్లా రమాకుమారి పంపిణీ చేశారు. కార్యక్రమంలో డెయిరీ మేనేజర్ ఈ.శ్రీనివాస్, సూపర్వైజర్ కాయల సత్యనారాయణ, రాంబాబు, పాల సంఘాల అధ్యక్షులు గౌతు బాబురావు, కసిరెడ్డి కన్నయ్య, యాదగిరి అప్పల నాయుడు, పిఎస్‌లు గొంతిని శ్రీనివాసరావు, జెర్రిపోతుల నూకునాయుడు, కోన పైడియ్యనాయుడు, డెయిరీ సిబ్బంది పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ ఫిర్యాదుపై విచారణ

ప్రజాశక్తి-కోటవురట్ల : మండలంలోని టి.జగ్గంపేట రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 309 గల డి-ఫామ్ భూమిపై పిజిఆర్ఎస్‌లో సీమకుర్తి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదుపై తహశీల్దార్ తిరుమలబాబు శుక్రవారం విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుడు అన్న వెంకట్రావు, అక్క గొల్లపల్లి సత్యవతి ఇందులో పాల్గొన్నారు. తండ్రి నుంచి సంక్రమించిన డి ఫారం భూమి 3.80 ఎకరాలు ముగ్గురు వారసులకు 1.26 ఎకరాలు చొప్పున సమానంగా దక్కుతుందని విచారణ అనంతరం తాహశీల్దారు తేల్చి చెప్పారు. ఈ విషయంపై తదుపరి ఫిర్యాదులు గాని కుటుంబ సభ్యులను వేధించడం గాని చేపడితే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు.

సిపిఆర్‌తో గుండెపోటు నివారించవచ్చు

ప్రజాశక్తి-అనకాపల్లి : కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సిపిఆర్) ప్రథమ చికిత్స అందించడం ద్వారా గుండెపోటు నివారించవచ్చని ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి ఆయుర్వేద వైద్యులు డాక్టర్ లావణ్య అన్నారు. అనకాపల్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో ఈనెల 13 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్న సిపిఆర్‌పై అవగాహన శిబిరాల్లో భాగంగా శుక్రవారం అవగాహన కల్పించారు. సిపిఆర్ అంటే ఒక వ్యక్తి శ్వాస తీసుకోవడం లేదా గుండె కొట్టుకోవడం ఆగిపోయినప్పుడు చేసే అత్యవసర ప్రాథమిక చికిత్స అని తెలిపారు. కార్యక్రమంలో ఆయుష్ ఫార్మసిస్ట్ గణేష్, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి-అచ్చుతాపురం : అనకాపల్లి -అచ్చుతాపురం రహదారి విస్తరణ పనులలో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు చౌడపల్లి, రామన్నపాలెం రోడ్డు కొత్తూరు మోసయ్యపేట -అనకాపల్లి రోడ్డులలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రహదారి వెడల్పులో భాగంగా స్తంభాలు మార్చుట, 11 కెవి 33 కెవి ట్రాన్స్ఫార్మర్ల తదితర విద్యుత్తు పనులు చేయనున్నట్లు పేర్కొన్నారు.

స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రపై ర్యాలీ

ప్రజాశక్తి-సబ్బవరం : స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి పీల్చడం ద్వారా మానవుని ఆయుష్ పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జాతీయ సేవ పథకం ప్రోగ్రాం అధికారి డాక్టర్ గణేష్ లెక్కల, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు ప్రారంభం

ఆనందపురంలో పోటీలు ప్రారంభిస్తున్న ఎంపిపి, నేతలు

ప్రజాశక్తి- రావికమతం:రావికమతం జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం మండల స్థాయి ఆటల పోటీలను స్థానిక ఎంపీపీ పైలరాజు, ఎంపీడీవో మహేష్, మండల విద్యాశాఖ అధికారిబి2 బ్రహ్మాజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ గెంజి మంగమోదినాయుడు, ఎంపీటీసీ వేపాడ లక్ష్మీ నాగేశ్వరావు చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ మాట్లాడుతూ, గెలుపొందిన విద్యార్థులు నియోజకవర్గస్థాయికి, జిల్లా స్థాయికి ఎంపిక అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీ ధనంజయ్, స్కూల్ అసిస్టెంట్ వేపాడ సత్యనారాయణ, పాఠశాల చైర్మన్ బూసాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నాతవరం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ హెచ్ ఎఫ్ ఐ) ఆధ్వర్యంలో మండల స్థాయి పోటీలు నిర్వహించారు. సర్పంచ్ గొలగణి రాణి, తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, కాపరపు అప్పలనరస, మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు, పైల పోతురాజు ,, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ. ఎంఈఓ 1 బ్రహ్మాజీ, ఎంఈఓ 2 కామిరెడ్డి వరహాలు బాబు పాల్గొన్నారు.

చీడికాడ: క్రీడల ద్వారా తమలో దాగిన నైపుణ్యతను వెలికి తీయవచ్చు అని ఎంపీపీ జయమ్మ తెలిపారు. వరాహపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు దొడ్డి వరాహమూర్తి ఆధ్వర్యంలో ఆటల పోటీలను ఎంపీపీ కురచ జయమ్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బొంజు బాబు, ఎంఈఓ 2 రమణ పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలో గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల స్థాయి ఆటలు పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. హై స్కూల్ హెచ్ఎం సత్య కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, పిఎస్ఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, కృష్ణ, శ్రీనివాసరావు, నాయకులు వైబోయిన రమణ, సుధాకర్ తదితర నాయకులు హాజరై, ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు కన్వీనర్‌గా హైస్కూల్ పీడీ ఎం.లోవకృష్ణ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు కే.నరేష్, రుత్తల నాగన్న దొర, ప్రధానోపాధ్యాయుడు వేమగిరి నూకరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

యస్.రాయవరం :మండలంలోని కొరుప్రోలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో డిప్యూటీ డిఈవో అప్పారావు మండల స్థాయి క్రీడా పోటీలను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ బత్తిని సత్యనారాయణ, హెచ్ఎం కె.ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని సీతయ్యపేట జెడ్పి హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలను ఎంపీపీ దాకారపు నాగేశ్వరి దేవి, జెడ్పిటిసి దొండ రాంబాబు ప్రారంభించారు. విజయరామరాజుపేట, వడ్డాది, దిబ్బిడి, రాజాం, సీతయ్యపేట తురకలపూడి, పెద్ద మదిన, గున్నంపూడి జెడ్‌పి పాఠశాలల విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. కార్యక్రమంలో హెచ్ఎం ఏ.సురేష్, పిడి బాల గణపతి పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట డిపిఎన్ హైస్కూల్‌లో మండల స్థాయి ఆటలు పోటీలు ప్రారంభించారు. చెస్‌లో తాళ్ళపాలెం హైస్కూల్, కన్నూరుపాలెం శ్రీగీత ప్రైమరీ స్కూల్, షట్టల్‌లో తేగాడ మోడల్ స్కూల్, కశింకోట సెయింట్ జాన్స్ స్కూల్, వాలీబాల్‌లో కన్నూరుపాలెం హైస్కూల్, తేగాడ మోడల్ పాఠశాల, యోగలో కశింకోట సెయింట్ జాన్స్ స్కూల్, కశింకోట డిపిఎన్ స్కూల్ విద్యార్థులు విజయం సాధించారు. కూటమి నాయకులు పరమేశ్వరరావు, వేగి గోపికృష్ణ, సిదిరెడ్డి శ్రీను, మళ్ల లోవకృష్ణ, తాకాశి కృష్ణ, ఎంఇఒ సురేష్ కుమార్, హెచ్ఎం ప్రసాదరావు, పిడి పి.కమల

నాతవరంలో...

కశింకోటలో..

పాల్గొన్నారు.

మునగపాక : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడాపోటీలను ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని తవ్వవానిపాలెం గ్రౌండ్‌లో మండల స్థాయి క్రీడా పోటీలను స్థానిక ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.పద్మజ, ఎంఈఓలు ఎస్.లక్ష్మణరావు, ఎంజే.రవీంద్రబాబు, సర్పంచ్ బోకం స్వామినాయుడు, మినర్వా స్కూల్ ప్రిన్సిపాల్ పి. పైడంనాయుడు, ఎస్‌జిఎఫ్ కోఆర్డినేటర్ అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

పాయకరావుపేట : పట్టణంలోని సమయమంతుల రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల స్థాయి ఆటల పోటీలను కూటమి నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చింతలపు ప్రదీప్, యాళ్ల వరహాలుబాబు, తోట నగేష్, పెద్దిరెడ్డి చిట్టిబాబు, గూటూరు శ్రీనివాసరావు, పల్లా విలియం కేరి, మజ్జూరి నారాయణరావు, రాజాన ఆది, గొల్లపల్లి నాగు పాల్గొన్నారు.

ఆనందపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను ఎంపిపి డాక్టర్ మజ్జి శారదా ప్రియాంక, ఎస్ఎంసి చైర్మన్ లక్ష్మి, ఎంపిటిసి రమాదేవి ప్రారంభించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహమూర్తి, ప్రసాద్ బుజ్జి తదితరుల పర్యవేక్షణలో హెచ్ఎం కామేశ్వరరావు, భాస్కరరావు, ముత్యాల నాయుడు, శంకర్రావు విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. దాతల సహకారంతో విద్యార్థులకు భోజన వసతి సౌకర్యాలు కల్పించారు. టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కోరాడ రాజబాబు, వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు,ఎంఇఒ జోగేంద్ర రావు గంగరాజు, స్కూల్ కమిటీ చైర్మన్ బి లక్ష్మి, వేములవలస పిఎసిఎస్ చైర్మన్ రౌతు నాగరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుప్ప రామలక్ష్మి, ఎంపిటిసి కొట్యాడ రమాదేవి రెడ్డిబాబు, కొట్యాడ సత్యమూర్తి, సిహెచ్ సూరిబాబు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను సత్కరిస్తున్న అధ్యక్షులు

వైసిపి బూత్ కమిటీ అధ్యక్షులకు అభినందనలు

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ :నర్సీపట్నం నియోజక వర్గంలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల నియమితులైన బూత్ కమిటీ అధ్యక్షులు, మేధావుల విభాగం అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర గణేష్‌ని నర్సీపట్నం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా నర్సీపట్నం రూరల్ మండలం మేధావుల విభాగం అధ్యక్షుడు కుంద్రాపు తాతబాబు, మండల బూత్ కమిటీ అధ్యక్షుడు పైల పైడియ్యానాయుడు (తాతాజీ), మాకవరపాలెం మండలం బూత్ కమిటీ అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వీరికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం రూరల్ మండలం ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, మాకవరపాలెం మండలం ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు, నియోజకవర్గ బూత్ ఇంచార్జ్ సుర్ల చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు చిటికెల రమణ, మాజీ పి.ఎస్.ఎస్. చైర్మన్ పాశపు నాగేశ్వరరావు, యూత్ అధ్యక్షుడు రుత్తల రాజుబాబు, బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీను పాల్గొన్నారు.

రావికమతంలో శిక్షణ ఇస్తున్న అధికారులు

ఆదాయ వనరుల పెంపుదలపై దృష్టి పెట్టాలి

- సర్పంచ్‌లకు ప్రత్యేక శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-నక్కపల్లి:గ్రామ పంచాయతీల్లో సొంత ఆదాయ పెంపుదల పై పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు దృష్టి పెట్టాలని ఎంపీడీవో డి.సీతారామరాజు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం గ్రామ పంచాయతీలో సొంత ఆదాయ పెంపుదలపై సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ,పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవడంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రావికమతం:మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయం భవనంలో శుక్రవారం సర్పంచ్లు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మహేష్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమాన్ని సర్పంచులు, కార్యదర్శులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎండిఓ సీతారామస్వామి, మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు కోమటి శంకర్రావు, కవగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి పాల్గొన్నారు.

గొలుగొండ:గొలుగొండ మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణలో పంచాయతీల అభివృద్ధి, ప్రగతి, ఆదాయం సమకూర్చుటపై శిక్షణ ఇచ్చారు.

సిమెంట్ బల్లలు ఏర్పాటు

ప్రజాశక్తి-గొలుగొండ: మాజీ సర్పంచ్ చిటికెల వెంకటరమణ భార్య నారాయణమ్మ జ్ఞాపకార్థంగా మనువడు గొలుగొండ మాజీ జడ్పీటిసి, ప్రస్తుత టిడిపి మండల అధ్యక్షుడు సిహెచ్ తారక వేణుగోపాల్ మండలంలో మేజర్ పంచాయతీ ఏఎల్.పురం గ్రామ స్మశాన వాటికలో శుక్రవారం సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారు.

ఏర్పాటు చేసిన బల్లలు

పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

డ్రెయినేజీ నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని సీహెచ్. నాగాపురం ఎస్సీ కాలనీలో డ్రైనేజీ నిర్మించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కాలనీలో 150 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, డ్రైనేజీ లేకపోవడంతో ఎక్కడ మురికి నీరు అక్కడే ఉంటుందని చెప్పారు. దీంతో కాలనీ వాసులు రోగాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం దళిత వాడలో దృష్టి పెట్టి డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కే.కన్నబాబు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పోషణ మాసోత్సవాలు

వడ్డాదిలో మాట్లాడుతున్న జెడ్పిటిసి రాంబాబు

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది కెజిబివిలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు, అంతర్జాతీయ బాలికా దినోత్సవ వారోత్సవాల ముగింపు సభను శుక్రవారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న జడ్పిటిసి దొండ రాంబాబు మాట్లాడుతూ లింగ నిర్ధారణ, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చెప్పారు. అనంతరం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మండలంలోని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం వెల్ బేబీ షోని నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు దొండ నారాయణమూర్తి, ఐసిడిఎస్ పిఒ మంగతాయరు, సూపర్వైజర్ నిర్మలాదేవి, కేజీబీవీ ప్రత్యేక అధికారి అన్నపూర్ణ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మండలంలో “కిశోరి వికాసం” కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. జెడ్పీటిసి సభ్యురాలు సుక్కల రమణమ్మ, ఎంపీడీవో ఉష శ్రీధర్, ఎంఈఓ తలుపులు, సిడిపిఓ జి.వి. రమణి, డాక్టర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : రాష్ట్రీయ పోషణ్ మాసాన్ని పురస్కరించుకొని ఆరిలోవ కాలనీ, చివరి బస్టాపు దరి జివిఎంసి కల్యాణమండపంలో శుక్రవారం 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ ఆధ్వర్యంలో తన సొంత నిధులతో 35 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌సి కనకమహాలక్ష్మీ, ఆరిలోవ ఎఫ్ఆర్‌యు వైద్యాధికారి డాక్టర్ అనిత, యూపిహెచ్‌సి డాక్టర్ కిరణ్‌లలిత, సిపిడిఒ నీలిమ, ఎసిడిపిఒ శ్రీలలిత పాల్గొన్నారు. గర్భిణులకు పౌష్టికాహార ఆవశ్యకత, ఆరోగ్య సూచనలు చేశారు.కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ వినిష, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సీమంతాల్లో కార్పొరేటర్ సునీత, తదితరులు

అవార్డును అందజేస్తున్న అధికారులు

మహాలక్ష్మినాయుడుకు అవార్డు ప్రదానం

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం మేడి వాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయుడు బొడ్డు మహాలక్ష్మి నాయుడుకు రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారులు ప్రశంసించారు. శుక్రవారం విజయవా డలో హీల్ పారడైజ్ స్కూల్లో జరిగిన భవిత మానిటరింగ్ సిస్టంపై రాష్ట్ర కీ రిసోర్స్ పర్సన్‌లకు, 26 జిల్లాల సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం కోఆర్డినేటర్లకు మూడు రోజులపాటు రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల విజయవాడలో సోలెట్ ఇంటర్నేషనల్ అవార్డ్స్ 2025 కార్యక్రమంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న మహాలక్ష్మినాయుడిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర శిక్ష అడిషనల్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె రవీంద్ర నాథ రెడ్డి, రాష్ట్ర సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం స్టేట్ కోఆర్డినేటర్, అసిస్టెం ట్ డైరెక్టర్ ఎన్. కె అన్న పూర్ణ చేతుల మీదుగా ధ్రువ పత్రంతో అవార్డును అందించారు. ఈ కార్యక్రమం లో అనకాపల్లి జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్యా సమన్వయకర్త బి రామకృష్ణ నాయుడుతో రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న నాయకులు

వాటర్ ట్యాంక్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ మండలం కసిమి పంచాయతీ జమ్మవరం గ్రామంలో రూ.20లక్షలతో 10వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. స్వీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చొరవతో ఈ నిధులు మంజూరయ్యాయని టీడీపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షులు కవల మహేష్, ఉపాధ్యక్షులు ఎ.మోహన్, సెక్రటరీ జి.బాబురావు, బూత్ కన్వీనర్ బుచ్చిబాబు, కార్యదర్శులు కె.సాయి, జె.లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-చీడికాడ :మండలంలోని వరహాపురం గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఎంపీడీవో హేమ సుందర్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బంది విధుల పనితీరుపై నిర్లక్ష్యాన్ని ఎంపీడీవో హెచ్చరిక జారీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందించడంలో సచివాలయం సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని, వీరిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సెప్టెంబర్, అక్టోబర్‌లో హాజరు పట్టికలో ఎందుకు సంతకాలు చేయలేదని ప్రశ్నించారు. సిబ్బంది ఉదయం 10.30గంటల లోపు కచ్చితంగా హాజరు వేసుకోవాలన్నారు.

బల్క్ డ్రగ్‌తో జీవనోపాధికి ముప్పు

ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

34వ రోజుకు మత్స్యకారుల దీక్షలు

ప్రజాశక్తి-నక్కపల్లి:బల్క్ డ్రగ్ రద్దు చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకారులు స్పష్టం చేశారు.మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు శుక్రవారం నాటికి 34వ రోజుకు చేరింది. బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. తమ జీవనోపాధి, ఉనికిని దెబ్బతీసే బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ తామంతా శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే రాజయ్యపేటలో భారీ ఎత్తున పోలీసు బలగాలను మోహరించి, ఎందుకు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ప్రశ్నించారు. నక్కపల్లి నుండి రాజయ్యపేట వరకు ఎక్కడికక్కడ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి, ఆధార్ కార్డులు, లైసెన్సులు చూపించమని పోలీసులు అడుగుతున్నారని, తమ ఆందోళనకు సంఘీభావం తెలిపేందుకు వస్తున్న నాయకులను అడ్డుకుంటున్నారని ఇది ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పిక్కి సత్యయ్య, మత్స్యకార నాయకులు మైలపల్లి మహేష్ బాబు, గోసల సోమేశ్వరరావు, పిక్కి తాతీలు, బైరాగి రాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నేతల అడ్డగింత

నక్కపల్లి:నక్కపల్లిలో ఉపమాక జంక్షన్ వద్ద శుక్రవారం రాజయ్యపేట వెళుతున్న వైసీపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలకు మద్దతు తెలిపేందుకు వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో ఆ పార్టీకి చెందిన నేతలు, ప్రజా ప్రతినిధులు బయలుదేరి రాజయ్యపేట వెళుతుండగా


అడ్డుకుంటున్న పోలీసులు

ఉపమాక జంక్షన్ వద్ద అనకాపల్లి డి.ఎస్.పి శ్రావణి ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. ఎందుకు అడ్డుకుంటున్నారని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పోలీసులను ప్రశ్నించారు. సెక్షన్ 30 అమలులో ఉన్నందున ఎవరు వెళ్లేందుకు అనుమతి లేదని డిఎస్పి స్పష్టం చేశారు. దీంతో వైసీపీ శ్రేణులు వెనుదిరిగారు. వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, సర్పంచ్ పొడగట్ల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు గంటా తిరుపతిరావు, నాయకులు మణిరాజు, తళ్ల భార్గవ్, సూరకాసుల గోవింద్, కొప్పిశెట్టి హరి, కొల్లాటి బుజ్జి పాల్గొన్నారు.

22న చలో రాజయ్యపేట

నక్కపల్లి:అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆధ్వర్యంలో ఈనెల 22న ఛలో రాజయ్యపేట కార్యక్రమం చేపట్ట నున్నట్లు వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ తెలిపారు. నక్కపల్లిలో శుక్రవారం పార్టీ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి మాట్లాడారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు 34 రోజుల నుండి శాంతియుతంగా రిలే దీక్షలు చేపట్టారని, వారికి సంఘీభావం తెలిపేందుకు గాను 22 న ఛలో రాజయ్యపేట కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రులు కురసాల కన్నబాబు,బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, కంబాల జోగులు, పార్టీ శ్రేణులు బొడ్డేడ ప్రసాద్ హాజరు కానున్నట్లు వెల్లడించారు.

చెక్కుల అందజేత

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో గొడిచెర్ల లో పిఎసిఎస్‌లో రుణాలు తీసుకుని మృతి చెందిన రైతులకు సంబంధించి ఇన్సూరెన్స్ నగదును శుక్రవారం పిఎసిఎస్ అధ్యక్షులు దార్ల కృష్ణ ఆధ్వర్యంలో అందచేసారు. 60 సంవత్సరాలు పైబడిన వారికి 15 వేలు, 60 సంవత్సరాలు లోబడిన వారికి 30 వేల చొప్పున 4 గురు రైతులకు సంబంధించి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, నక్కపల్లి, వేంపాడు పీఏసీఎస్‌ల అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, శ్రీనివాసరావు, సీఈఓ కురందాసు సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో స్ప్రేయింగ్

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ మండలం గుండుపాల గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు కంపాక్ట్ బ్లాక్‌లలో ఐదు మంది రైతులకు సంబంధించి ఐదు ఎకరాల విస్తీర్ణంలో వరి పొలాల్లో శుక్రవారం జిల్లేడు ద్రావణం, ఇంగువ కలిపి స్ప్రేయింగ్ చేయడం జరిగింది. వీటితో సమయం, ధనం ఆదా అవుతుందని సర్పంచ్ చిన్నరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోడల్ మేకర్ రామకృష్ణ, ఐసిఆర్‌పిఎస్ సత్యవేణి, గంగ, మాస్టర్ ట్రైనర్ వరలక్ష్మి రైతులు పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాల మేరకు పరిహారం చెల్లించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు డిమాండ్

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-మునగపాక : అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్ల స్థలాలు కోల్పోతున్న నిర్వాసితులకు 2013 చట్ట ప్రకారం పరిహారం ఇవ్వాలన్న హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రం మునగపాకలో శుక్రవారం నిర్వాసితులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విస్తరణలో భూములు, ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితులకు నగదు రూపంలో కాకుండా టిడిఆర్‌లు ఇస్తామని అధికారుల చెప్పడాన్ని పలు గ్రామ సభల్లో నిర్వాసితులు నిరాకరించారని గుర్తు చేశారు. ప్రభుత్వం, అధికారులు నిర్వాసితుల గోడు పట్టకుండా మొండిగా వ్యవహరించడం పట్ల నిర్వాసితుల సంఘం హైకోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. వీఎంఆర్డిఏ నోటిఫికేషన్ తిరస్కరిస్తూ ఈనెల 14న హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం నాడు ఇచ్చిన హామీ ప్రకారం 2013 చట్టం ప్రకారం నిర్వాసితులకు నగదు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ, నిర్వాసితుల సంఘం కన్వీనర్ ఆర్ రాము, కో కన్వీనర్ కె.రామసదాశివరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, ఎస్ బ్రహ్మాజీ, ఆళ్ల మహేశ్వరరావు, కె.రాము, టెక్కలి జగ్గారావు, కూండ్రపు సోమునాయుడు, ఎంఎవిఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాల అమలుకు వినతి

ప్రజాశక్తి - విశాఖపట్నం : అచ్యుతాపురం - అనకాపల్లి రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్ల స్థలాలు కోల్పోతున్న నిర్వాసితులకు టిడిఆర్ బాండ్లు వద్దని, 2013 భూ సేకరణ చట్ట ప్రకారం పరిహారం ఇవ్వాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని రోడ్డు విస్తరణ నిర్వాసితుల సంఘం నాయకులు విఎంఆర్‌డిఎ అడిషనల్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు వారు హైకోర్టు ఇచ్చిన ఆర్డర్ కాపీని ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, నిర్వాసితుల సంఘం కన్వీనర్ ఆర్.రాము, కో-కన్వీనర్ కె.రామసదాశివరావు, రైతు సంఘం నాయకులు కర్రి అప్పారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తామని గ్రామసభలు నిర్వహించి, ఇప్పుడు నగదు రూపంలో భూములు, ఇళ్ల స్థలాలకు డబ్బులు చెల్లించకుండా విఎంఆర్‌డిఎ టిడిఆర్‌లు ఇస్తామనడం తగదన్నారు. వాటి వల్ల నిర్వాసితులకు ఏమాత్రమూ ఉపయోగం లేదని చెప్పారు. 2013 భూ సేకరణ చట్టాన్ని వర్తింపజేయాలన్నారు.

విఎంఆర్‌డిఎ అడిషనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

నేడు, రేపు జిఎస్‌టిపై షాపింగ్ ఫెస్టివల్

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ ఆదేశాల మేరకు "సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్" ప్రచార కార్యక్రమంలో భాగంగా అనకాపల్లిలోని మెయిన్ రోడ్డులో "అనకాపల్లి షాపింగ్ ఫెస్టివల్" ఈనెల 18, 19 తేదీలలో సాయంత్రం 6 నుండి 9 గంటల వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్టీ రేట్ల తగ్గింపుపై వినియోగదారుల్లో సరైన అవగాహన కల్పించడం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనకాపల్లి షాపింగ్ ఫెస్టివల్ సందర్భంగా స్థానిక వ్యాపారులు, వ్యాపార సంఘాలు, వాణిజ్య సంస్థలు పెద్ద ఎత్తున పాల్గొని తమ ఉత్పత్తులు, సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ఫెస్టివల్‌లో వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లు, తగ్గింపులు, అవగాహన స్టాల్స్, వినోద కార్యక్రమాలు, కస్టమర్ కౌన్సిలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై "అనకాపల్లి షాపింగ్ ఫెస్టివల్"లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.